నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 7-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి:30 సంచిక:187 పేజీలు:6 వెల: రూ.1/-

చురక

అధికారంలున్నప్పుడు
అస్పృశ్యత పాటింపు
పొలంబాట ఆలింగన
ప్రేమ నేడు చాటింపు.
కాలుదీసి కాలువేస్తే
కరువు రాజకీయం
కాగలదా ఇంత చేస్తే
గతం తప్పు మాయం

-వేల్పుల నారాయణ

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్ కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 6:తెలంగాణ- ఛత్తీస్ గఢ్ సరిహద్దు అటవీప్రాంతంలో శనివారం ఉదయం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. కూబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. పోలీసు బలగాల కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలిలో 3 తుపాకులు, పేలుడు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా కర్రిగుట్టలు- ఛత్తీస్ గఢ్ లోని కాంకేర్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నాలుగు రోజుల క్రితం బీజాపూర్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో 13 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే

అమెరికాలో తెలుగు యువకుడు శరత్‌ను హత్యచేసిన దోషికి మరణశిక్ష

ఒక్లహామా ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలుగు యువకుడిని హత్యచేసిన అమెరికా వ్యక్తికి అక్కడి ప్రభుత్వం మరణశిక్ష అమలు చేసింది. ఒక్లహామాలో స్టోర్ క్లర్క్‌గా పనిచేస్తున్న 24 ఏళ్ల శరత్ పుల్లూరు 22 ఫిబ్రవరి 2002లో దారుణహత్యకు గురయ్యాడు. అదే రోజు జానెట్ మూర్ అనే 40 ఏళ్ల మహిళ కూడా హత్యకు గురైంది. వేర్వేరుగా జరిగిన ఈ హత్యకేసుల్లో అరెస్ట్ అయిన 41 ఏళ్ల మైఖేల్ డేవేన్ స్మిత్‌ను దోషిగా తేల్చిన కోర్టు మరణశిక్ష విధించింది. అప్పటి నుంచి జైలులోనే ఉన్న స్మిత్‌కు గురువారం జైలు అధికారులు మరణశిక్ష అమలుచేశారు.. మెక్ అలెస్టర్ పట్టణంలోని ఒక్లహామా స్టేట్ ప్రిజన్‌లో ప్రాణాంతకమైన ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మరణశిక్ష అమలుచేశారు. మరణశిక్ష అమలు అనంతరం ఒక్లహామా అటార్నీ జనరల్ ఓ స్టేట్‌మెంట్ విడుదల చేస్తూ స్మిత్‌కు మరణశిక్ష అమలుచేయడం ద్వారా 22 ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత బాధిత కుటుంబాలకు న్యాయం జరిగినట్టు తెలిపింది. కాగా, ఒక్లహామాలో ఓ దోషికి మరణశిక్ష విధించడం ఈ ఏడాది ఇదే తొలిసారి.

ముస్లిం లీగ్ ఐడియాలజీ తరహాలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో: ప్రధాని మోదీ

షహరాన్‌పుర్: నేటి భారత్‌కు కావాల్సిన ఆశలు, ఆశయాలకు దూరంగా ప్రతిపక్ష పార్టీ ఉందని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ముస్లిం లీగ్ భావజాలాన్ని పోలి ఉన్నదని ప్రధాని మోదీ(ఖఒ ఓనీటతి) అన్నారు. ప్రధాని మోదీ తొలిసారి కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై స్పందించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో స్వాతంత్రోద్యమం నాటి ముస్లిం లీగ్ ఆనవాళ్లు ఉన్నాయని, కొంత భాగం లెఫ్టిస్ట్ భావజాలం నిండి ఉన్నట్లు ప్రధాని ఆరోపించారు. యూపీలోని షహరాన్‌పుర్‌లో జరిగిన ఎన్నికల సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. దేశ స్వతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీ కథ కొన్ని దశాబ్దాల క్రితమే ముగిసిందని ప్రజలు అనుకుంటున్నారని మోదీ తెలిపారు. ఆశలు, ఆశయాలు లేని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోతో దేశాన్ని ముందుకు నడిపించలేదన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ వద్ద ప్రణాళికలు లేవని, దేశ ప్రగతి పట్ల విజన్ కూడా లేదని మోదీ అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ

- కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు 25 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారు
-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు 25 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అహంకారం వల్ల బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఆ పార్టీ బలం 104 మంది ఎమ్మెల్యేల నుంచి ఆ సంఖ్య 39కి చేరిందని ఉత్తమ్ కుమార్ గుర్తుచేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనలో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధం అని ఉత్తమ్ తేల్చి చెప్పారు. కేసీఆర్ పాస్ పోర్టులు విక్రయించి, కాంట్రాక్టర్లకు బ్రోకర్ల లాగా తాను పనిచేయలేదని మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. వ్యవసాయశాఖపై అసెంబ్లీలో మాట్లాడిన సమయంలో కేసీఆర్ ఏం చేశారని అడిగారు. ఆ సమయంలో ఇంట్లో పడుకొని, ఇప్పుడు అరుస్తారా అని ఉత్తమ్ విరుచుకుపడ్డారు.

జర్నలిస్టులూ పోస్టల్ బ్యాలెట్స్‌కు దరఖాస్తు చేసుకోండి..

హైదరాబాద్, ఏప్రిల్ 6:లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు.

ఏప్రిల్ 12లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కవరేజీ కోసం ఎన్నికల అధికార లెటర్లకు దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు ఫారం 12ని డౌన్‌లోడ్ చేసుకుని.. ఫారాన్ని నింపిన తర్వాత ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సచివాలయం మీడియా పాయింట్ పక్కనే ఉన్న పబ్లిసిటీ సెల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

దరఖాస్తుతో పాటు ఓటర్ ఐడీ కార్డు జిరాక్స్, అక్రిడేషన్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాలి. అంతేకాకుండా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఓటర్ పోర్టల్ ద్వారా తమ ఎపిక్ నంబర్‌ను సరిచూసుకుని జతపరచాలని అధికారులు సూచించారు.

ఒకసారి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు సమర్పించిన తర్వాత.. ఎట్టి పరిస్థితుల్లో కూడా విత్ డ్రా చేసుకునేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఖమ్మం నుంచి వందలాదిగా తుక్కుగూడ తరలిన కాంగ్రెస్ శ్రేణులు

- జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మధురానగర్ వాసులు

ఖమ్మం, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టో విడుదల కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన జన జాతర బహిరంగ సభకు ఖమ్మం నగరంలోని 14 వ డివిజన్, మధుర నగర్, గొల్లగూడెం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, జనం భారీగా తరలి వెళ్లారు. దాదాపు అన్ని డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తుమ్మల అభిమానులు, ప్రజలు వందలాదిగా బస్సుల్లో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ ర్యాలీని తుమ్మలపల్లి వెంకటయ్య, సూర్యప్రకాష్, రావెళ్ల రాంప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా జాతీయ మేనిఫెస్టో విడుదల కానుందని, ఇందిరమ్మ రాజ్యంలో దేశ వ్యాప్తంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందబోతున్నాయని అన్నారు. గతంలో తుక్కుగూడ సభానంతరం నిరంకుశ బీఆర్ఎస్ కు బీటలు వారాయని, ఇప్పుడు ఈ సభానంతరం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతా జాగ్రత్తగా వెళ్లి... క్షేమంగా స్వస్థలాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బండి నాగేశ్వర రావు, కమతం రామకృష్ణ, డివిజన్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాళ్లూరి జ్యోతి, షేక్ బడా సాహెబ్, షేక్ షరీఫ్, షేక్ మదర్ సాహెబ్, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, ఉపేంద్ర, రామనాథం, షేక్ సులేమాన్, తదితరులున్నారు.

తీపికబురు చెప్పిన వాతావరణ శాఖ..
రాబోయే రెండురోజులు ఈ జిల్లాలకు వర్ష సూచన..!

హైదరాబాద్, ఏప్రిల్ 6:ఎండల తో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రాగల రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు కురుస్తాయని పేర్కొంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో రాత్రిళ్లు వేడిగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఆదివారం ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది.

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ వేడి, తేమతో కూడిన పరిస్థితులుంటాయని చెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో రాత్రిపూట వేడిగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని వివరించింది.

కొత్త రికార్డు నెలకొల్పిన డీమ్యాట్ ఖాతాలు..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినా, దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ చేయాలన్నా బ్యాంకుల్లో డీ-మ్యాట్ ఖాతాలు తెరవడం తప్పనిసరి. దేశంలో డీమ్యాట్ ఖాతాలు కొత్త రికార్డు నమోదు చేశాయి. భారత్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో డీమ్యాట్ ఖాతాలు కొత్తగా 3.70 కోట్ల ఖాతాలు ప్రారంభం అయ్యాయి. ఇటీవలి కాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆకర్షణీయ లాభాలు వస్తుండటంతో ఇన్వెస్టర్లలో సానుకూలత నెలకొంది. ప్రతి నెలా సరాసరి 30 లక్షల మందికి పైగా కొత్త డీమ్యాట్ ఖాతాలను తెరుస్తున్నారు. దీంతో డీమ్యాట్ ఖాతాలు 15 కోట్లకు చేరాయి.

దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్‌పై మనస్సు పారేసుకున్నారు. మరోవైపు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి పెరిగింది. స్టాక్ మార్కెట్లతోపాటు మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులతో 2023-24లో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 3.7 కోట్లకు చేరుకున్నది. 2022-23తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో 32 శాతం ఎక్కువ.

ట్యాంకర్ ట్రాకింగ్!.. ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్న జలమండలి

-ఎప్పుడొస్తుందో వినియోగదారుడికి తెలుసుకునే వీలు
-ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు
-రియల్ టైం ట్రాకింగ్ విధానంతో అక్రమదందాకు చెక్

హైదరాబాద్, ఏప్రిల్ 6:వాటర్ ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలకు చెక్ పెడుతూ జలమండలి కీలక నిర్ణయం తీసుకున్నది. గాడి తప్పుతున్న ట్యాంకర్‌ను ట్రాకింగ్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. వినియోగదారుడికి అత్యంత పారదర్శకంగా ట్యాంకర్ నీటిని చేర్చేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్‌కు యమ డిమాండ్ ఉన్నది. ఇదే అదునుగా కొందరు ట్యాంకర్ నీటిని పక్కదారికి మళ్లిస్తూ అక్రమ దందాకు తెరలేపారు.

ఈ నేపథ్యంలో రియల్ టైం ట్రాకింగ్ విధానాన్ని అమలు చేసి వాటర్ ట్యాంకర్ నీటిని సక్రమంగా అందించే చర్యలకు జలమండలి ఉపక్రమించింది. ఇందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఈ ట్రాకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాబోయే వారం రోజుల్లోగా 75 ఫిల్లింగ్ స్టేషన్లలో పైతం ట్రాకింగ్‌లోకి వాటర్ ట్యాంకర్లను తీసుకొస్తామని ఐటీ విభాగం అధికారులు తెలిపారు. సంస్థ పరిధిలో ఉన్న 700 ట్యాంకర్లను ట్రాకింగ్‌లోకి తీసుకొచ్చి ఉబర్, ఓలా తరహాలో వాహనం ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఎంత సేపటిలో ట్యాంకర్ ఇంటికి చేరుతుందో వినియోగదారులు తెలుసుకునేలా పారదర్శక సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం.. రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని.. ఇది బాధాకరమైన పరిస్థితి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే రైతులకు ఇలాంటి దుస్థితి రావడానికి సీఎం రేవంత్ రెడ్డి సర్కారే అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతుదీక్షలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎర్రటి ఎండల్లో కేసీఆర్ రైతుల దగ్గరికి వెళ్లి భరోసా ఇచ్చారు. కేసీఆర్ బాటలో బీఆర్ఎస్ శ్రేణులు నేడు దీక్షలు చేస్తున్నారు. కాంగ్రెస్ హామీలు నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను పంపించి దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చిందని సీఎం, మంత్రులు చావుకబురు చెబుతున్నారు. పాలన తన చేతుల్లో లేదని సీఎం రేవంత్ అనడం సిగ్గు చేటు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే రైతులు ముందుకు రావాలి. పంటలకు బోనస్ ఇస్తామని ఈసీకి రేవంత్ లేఖ రాయాలి. మేం కూడా మద్దతిస్తాం.. మీ తీరుగా ఎక్కడా అడ్డుకోం. పంటలకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతు బంధు కోసం పెట్టిన డబ్బులు ఎక్కడ..?

మంత్రులకు తెలివుందా.. లేదా..? వర్షాలు ఎక్కువ పడి పంటలు మునిగిపోయాయని మంత్రి శ్రీధర్ బాబు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు వర్షాలు పడలేదని శ్రీధర్ బాబు అంటున్నారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం రూ. 7 వేల కోట్లు సిద్ధంగా పెట్టాం. రైతుబంధు ఇవ్వొద్దని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆపింది. రైతు బంధు కోసం పెట్టిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలి. తెలంగాణకు నీళ్లు రావాలంటే ఎత్తిపోతలే మార్గం. అందుకే.. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు నిర్మించాం. భారీ మోటార్లు పెట్టి గోదావరి నీళ్లు ఎత్తిపోశాం. ఇవాళ కూడా గోదావరిలో 2 వేల క్యూసెక్కుల నీళ్లు పోతున్నాయ్. ఎర్రటి ఎండల్లో కూడా చెరువులు మత్తళ్లు దుంకినయ్. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. 300 పిల్లర్లు ఉన్న బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగినయ్. కేసీఆర్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారు. యూట్యూబ్‌లో వచ్చే తప్పుడు వార్తలు చూసి ఆగం కావొద్దు. కేసీఆర్ వస్తున్నారని అన్నారం, సుందిళ్ల నీళ్లు వదిలారు. హరీశ్‌రావు హెచ్చరిస్తే కూడవెల్లి వాగుకు నీళ్లు ఇచ్చారు. ఇన్నాళ్లు నీళ్లు ఉన్నా కూడా ఇవ్వలేదని అర్థమైంది కదా..!

అని కేటీఆర్ పేర్కొన్నారు.

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి

కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మోసం చేశారు. రుణమాఫీని సీరియస్‌గా తీసుకోవద్దని రేవంత్ అంటున్నారు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసింది. వరికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ఇవ్వడం లేదు. రుణమాఫీ అయినోళ్లు, బోనస్ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి. కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. కృష్ణానది ప్రాంతంలో కూడా కరువు పరిస్థితులు వచ్చాయి. సాగర్‌లో నీళ్లున్నా కూడా పంటలకు నీళ్లు ఇవ్వలేదు. మిషన్ భగీరథ అప్పగించినా నీళ్లిచ్చే తెలివి కాంగ్రెస్‌కు లేదు. వండిన అన్నం వడ్డించే తెలివి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రేవంత్ మొగోడైతే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

ప్రతి కొనుగోలు కేంద్రానికి వెళ్లి రూ. 500 బోనస్‌పై నిలదీద్దాం. ఎలక్షన్ కోడ్ ఉందంటే అయిపోయినంక ఇస్తామని రేవంత్ మాటివ్వాలి. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజలకు వివరించాలి. ప్రభుత్వాన్ని కూలగొడుతామని రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నాడు. రేవంత్ మొగోడైతే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి. రూ. 500 బోనస్ ఇవ్వాలి. ఆసరా పెన్షన్ రూ. 4 వేలు ఇవ్వాలి. ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

స్మార్ట్ కిడ్జ్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

ఖమ్మం, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం రంజాన్ సబురాలను నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని పాఠశాల చిన్నారులు మతసామరస్యాన్ని చాటుతూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు పవిత్ర ఖురాన్ చదువుతూ నమాజులో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. సేమ్యాలు ఒకరికొకరు పంచుకుంటూ తమ ఆత్మీయతను తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ దీక్షా దక్షిత కు ప్రతీకగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. రోజంతా కఠిన ఉపవాస దీక్షలో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మికత వెల్లివిరిస్తున్నది అన్నారు. అందరూ కలిసిమెలిసి ఐక్యతను చాటుతూ మతసామరస్యాన్ని తెలియజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిభాపూలేకు భారతరత్న ప్రకటించాలి

- అంబేద్కర్ యువజన సంఘం టిఎస్ఎస్ఏ డిమాండ్
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యనారాయణ

ఖమ్మం, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): మహాత్మజ్యోతిభాపూలే జయంతి ని పురస్కరించుకొని మహనీయుల జయంతి కరపత్రలను కల్లూరులో సంఘ నాయకుల సమక్షంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యనారాయణ ఆవిస్కరించారు. సంక్షేమ హాస్టల్ డైట్ బిల్లులు వెంటనే విడుదల చేసి హాస్టల్స్ ను విద్యార్థులను కాపాడాలని వారు తెలిపారు. మహనీయుల జయంతులను, మార్చి నుండి ఏప్రిల్ 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవాలని బహుజనులకి పిలుపునిచ్చారు. అంబేద్కర్ యూవజన సంఘం తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మండల గ్రామాల లోనూ పెద్ద ఎత్తున రాష్ట్ర నాయకులు మహేష్, అజయ్ నిర్వహించాలని తెలిపారు. త్వరలో రాష్ట్ర ఫౌండర్ మహేష్, వేమూరి అజయ్ రాష్ట్ర మంతటా పర్యటించి అన్ని జిల్లా మండల కేంద్రలలో కరపత్రలను ఆవిష్కరించి రాబోయే రోజులలో పూలే అంబేద్కర్ ల జయంతులను గడప గడపకు తీసుకోని పోవాలని వారు తెలిపారు. విద్యార్థులు ఉద్యోగులు నిరంతరం పూలే అంబేద్కర్ కాన్షిరాంల చరిత్రను ప్రచారంలో వుంచాలని అప్పుడే నూటికి తొంబై శాతం జనాభా ఉన్న వారికీ న్యాయం జరుగుతుందని దమళ్ళ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రాజు, వెంకట్, శ్రీను, జగపతి తదితరులున్నారు.

Badri Foundation
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
రాళ్ళబండి శశిశ్రీ కవితా సంపుటి
అనుమంద్రం
ఆవిష్కరణ సభ
ఆవిష్కర్త తల్లావఝ్ఝల శివాజీ
సభాధ్యక్షత అనిల్ డ్యాని
ముఖ్య అతిథి కవి యాకూబ్
ఆత్మీయ అతిథి మామిడి హరికృష్ణ
వక్తలు
అంబటి సురేంద్రరాజు
ఘంటశాల నిర్మల
సిద్ధార్థ
సభా పరిచయం
సత్యవాణి
17 ఏప్రిల్ 2024 బుధవారం
సా. 6:00 గం.
రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్ హైదరాబాద్
అందరూ ఆహ్వానితులే!

నేటి కందం- నేటికి అందం
కలభాషణతోబాటుగ
కలరూపము గూడగాంచి కమ్మని రీతిన్
టెలివిజను ప్రసారములలో
తొలిసారిగ మానవాళి తూగాడె ధరన్
7-4-1927 ప్రపంచంలో మొట్టమొదటిసారి టెలివిజను ప్రసారాలు ప్రారంభం (వాషింగ్టన్ నుండీ న్యూయార్కు వరకు)
-రాధశ్రీ
సెల్:9494481210

ఇజ్రాయిల్ రక్తదాహం తీరేదెపుడు?!

(07 ఏప్రిల్ నాటికి ఇజ్రాయిల్ హమాస్ యుద్ధానికి ఆరు మాసాలైన సందర్భంగా)

పాలస్తీనాలోని ప్రముఖ నగరం గాజాలో మానవీయ పరిస్థితులు మంటగలుస్తున్నాయని, రంజాన్ పండుగ నేపథ్యంలో సత్వరమే బేషరతుగా ఇజ్రాయిల్ సైనిక దాడులను/కాల్పులను ఆపాలని, హమాస్ చేపట్టిన బందీలను వెంటనే విడుదల చేయాలని 25 మార్చి 2024న తొలిసారి యూఎన్ గైర్హాజర్ అయినా ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఏకాభిప్రాయానికి వచ్చి ప్రకటన చేయడం ఆహ్వానించదగిన పరిణామం. ఐరాస భద్రతామండలి ఆలస్యంగానైనా ఇటీవల తీసుకున్న తీర్మానం ప్రకారం గాజా నగరవాసులకు మానవీయ సహాయం సత్వరమే అందించాలని నిర్ణయించడం కూడా ముదావహంగా ఉన్నది. యూఎన్ భద్రతామండలి తీర్మానం సూచన మాత్రమే అని, వెంటనే కాల్పుల విరమణ అమలు కావడం ఆయా దేశాల మీద మాత్రమే ఆధారపడుతుందని యూఎస్ తెలుపడం కొంత కలవరానికి కారణం అవుతున్నది. ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య విభేదాలు మరిచి కాల్పుల విరమణను అమలు పరచాలని, మానవీయత మంటగలిసే యుద్ధాలు శాశ్వత పరిష్కారాలు కావని ఇరుపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని వలసలు వెళ్లడం, పిల్లలు కూడా తుది శ్వాస విడవడం హృదయవిదారకంగా ఉండడం చూస్తున్నాం.

యుద్ధం దీర్ఘకాలం పాటు కొనసాగుతుందా..!

07 అక్టోబర్ 2023న హమాస్ ఆకస్మికంగా దక్షిణ ఇజ్రాయిల్ ఆవాసాలపై చేసిన దాడుల్లో 1,200 మంది మరణించగా, 240 మంది బందీలుగా హమాస్ చేతుల్లో పట్టుబడ్డారు. మానవీయ సేవల్లో భాగంగా పోలియో, టిబి, మీసిల్స్, హెపటైటిస్ లాంటి ప్రమాదకర వ్యాధుల కట్టడికి యూనిసెఫ్ ద్వారా 6 లక్షలకు పైగా డోసుల టీకాలు గాజా నగర పిల్లల నిమిత్తం అందించబడ్డాయి. వీటితో పాటు దాదాపు వేయి ట్రక్కులకు పైగా ఆహారం, నీరు, ఔషధాలు, గుడార సామాగ్రి కూడా అందించబడుతున్నది. గాజాలో నేడు స్మశాన వాతావరణం కనిపిస్తున్నది. ఆహారం, సురక్షిత తాగునీరు, కనీస ఔషధాలు కరువైనాయి. ఇంత జరిగినా హమాస్‌ను తుదముట్టించే వరకు ఈ యుద్ధం 2024లో కూడా సుదీగర్ఘకాలం పాటు కొనసాగుతుందని ఇజ్రాయిల్ మిలిటరీ అధికారులు తెలుపడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి.

అమానవీయ మారణహోమం:

ఈ యుద్ధంతో గాజా నగరంలో 85 శాతం జనాభాకు (మొత్తం జనాభా 23 లక్షలు) పైగా ప్రజలు తమ ఇండ్లను కోల్పోయి వలసలు వెల్లడి జరిగింది. ఇప్పటి వరకు 31,000 మందికి పైగా పాలస్తీనియన్లు, అందులో 13,000 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోవడంతో పాటు 70,000లకు పైగా మంది పౌరులు గాయపడడం నమోదైంది. గత నవంబర్‌లో జరిగి తాత్కాలిక ఒప్పందం ప్రకారం కొద్ది మంది ఇజ్రాయిల్‌కు చెందిన బందీలను హమాస్ విడుదల చేయడం, ఇజ్రాయిల్ కాల్పుల్లో 30కి పైగా బందీలు చనిపోవడం కూడా జరిగిపోయింది. చనిపోయిన వారిలో సైనికులతో పాటు సాధారణ అమాయక పౌరులు/పిల్లలు కూడా ఉండడం యుద్ధ నీతి నియమాల ఉల్లంఘణ కిందికి వస్తుందని కూడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

గాజా ప్రజలు, పిల్లలు ఆకలి కేకలు వేయడం, కనీస అవసరాలకు అర్రులు చాచడం చూస్తున్నాం. గాజాలో నిత్యావసర సరుకుల ధరలు చుక్కలను అంటుతుంటున్నాయి. ఇజ్రాయిల్ విచక్షణారహితంగా పౌర ఆవాసాలపై కావాలనే దాడులు చేయడంతో యుద్ధ నీతి తుంగలో తొక్కినట్లు అయ్యింది.

ఇజ్రాయిల్ ఏరియల్ బాంబులు, "డంబ్ బాంబులు" నగరాలపై లక్ష్యంగా ప్రయోగిస్తుండడంతో సాధారణ పౌరులు, పిల్లలు చనిపోవడం లేదా గాయపడడంతో పాటు ఇండ్లు నేలమట్టం కావడం అమానవీయంగా తోస్తున్నది.

ఇజ్రాయిల్‌పై ఎర్ర సముద్ర వేదికగా హతీస్ ఆవేశ దాడులు::

యెమెన్‌కు చెందిన ఇరానీ-బ్యాక్డ్ హూతీస్ సంస్థ గత నవంబర్ 2023 నుంచి పాలస్తీనా ఇస్లామిక్ హమాస్ సంస్థకు సంఘీభావంగా ఎర్ర సముద్రం మీదుగా ఇజ్రాయిల్‌తో పోరు చేస్తున్నది.

దీనితో భారత్ లాంటి దేశాలకు ముడి చమురు రవాణాకు దగ్గరి దారైన సుయజ్ కెనాల్ మార్గాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ప్రత్యామ్నాయ 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' మార్గంలో ముడి చమురు రవాణాకు దూరాలు పెరిగి భారత్, యూరోప్ దేశాలపై రవాణా ఖర్చుల ఆర్థిక భారం అధికం అవుతున్నది.

గాజాలో జరుగుతున్న మారణహోమానికి ఇజ్రాయిల్ చరమగీతం పాడాలని, సత్వరమే బేషరతుగా ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించి గాజా ముస్లిమ్ సమాజం ఆనందంగా రంజాన్ పర్వదిన వేడుకలు జరుపుకోవాలని ప్రపంచ మానవాళి ఆశపడుతున్నది.

ఇప్పటికైనా ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ మానవత్వ కోణంలో యుద్ధాన్ని ఆపాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

అప్పన్న చందనోత్సవానికి భారీ విరాళం..

అమరావతి, ఏప్రిల్ 6: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం వరహా లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో మే 10న అప్పన్న నిజరూప దర్శనం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో చందన సమర్పణకు అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు దంపతులు శనివారం ఆలయ ఈవో సింగం శ్రీనివాస్ మూర్తిని కలిసి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. దాతల సహకారంతోనే దేవాలయాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. ఇటీవలే సింహగిరిపై చేపట్టిన నారసింహ మహా యజ్ఞం పూర్తి స్థాయిలో విజయవంతం కావడానికి దాతల సహకారం ఎంతో ఉందన్నారు. చందన సమర్పణకు తొలి విరాళం అందడం అభినందనీయం అన్నారు.

గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ.. ఏటా చందన సమర్పణకు తాము లక్ష చొప్పున విరాళంగా అందజేస్తామన్నారు. గతంలో దేవస్థానం అమలు చేసిన స్వర్ణ తులసీ దళాలు, స్వర్ణ పుష్పార్చన పథకాలకు బంగారం కొనుగోలుకు విరాళం అందజేసినట్టు తెలిపారు. అన్నప్రసాదానికి గతంలో మూడు లక్షలు విరాళం, కవచం కోసం 27 కిలోల ఇత్తడి, వివిధ సామగ్రి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు టీపీ రాజ గోపాల్, ఏఈవో ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పూతలపట్టు ఎమ్మెల్యే

అమరావతి, ఏప్రిల్ 6:వైసీపీకి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గుడ్‌బై చెప్పారు. శనివారం వైఎస్ షర్మిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు షర్మిల కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అయితే, సీఎం జగన్ పూతపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూతిరేకుల సునీల్ కుమార్ ఖరారు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను అయిన తనను కాదని..మరో వ్యక్తికి టికెట్ కేటాయించడంతో బాబు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ మార్పులు వార్తలు వచ్చినా.. ఇంతకాలం సైలెంట్‌గా ఉన్నారు. తాజాగా ఇవాళ షర్మిల హామీ మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

హామీలు నెరవేర్చకపోతే పోరాటం.. ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్, ఏప్రిల్ 6:ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, లేకపోతే రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ తెలియజేశారు. శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు కరీంనగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని, వెంటనే రైతుబంధు నిధులు కర్షకుల ఖాతాల్లో జమ చేయాలని, కౌలు రైతులకు హామీ ఇచ్చిన విధంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ధాన్యానికి మద్దతు ధర అందించడంతో పాటు 500 రూపాయల బోనస్ చెల్లించాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల రైతులు సాగునీరు అందక పంట నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు.

దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా హామీలు పూర్తి చేయని కాంగ్రెస్ కు పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

పేరుకే కూటమి.. అభ్యర్థులంతా టీడీపీ వాళ్లే.. చంద్రబాబుపై సజ్జల ఫైర్

-జనసేన, బీజేపీని అంతం చేయడమే చంద్రబాబు లక్ష్యం
-అధికారులపై పెత్తనం కోసం ఆరాటం
-తప్పుడు ఫిర్యాదులతో బాబు అండ్ కో
-పెన్షన్ మరణాలకు బాబే కారణం

తాడేపల్లి ఏప్రిల్ 6: కూటమి తరుపున పోటీ చేసే అభ్యర్థులను చంద్రబాబే నిర్ణయిస్తున్నారని ఆరోపించారు ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. కూటమిలో జనసేన, బీజేపీకి అసలు ఉనికే లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ?. ప్రజలు ఏమనుకుంటారనే ఆలోచన లేకుండా బాబు ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వ్యవస్థలను చంద్రబాబు మేనేజ్ చేస్తున్నారన్నారు. అధికారులను చంద్రబాబు కంట్రోల్ చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులపై చంద్రబాబు అండ్ కో తప్పుడు ఫిర్యాదులు చేస్తోందన్నారు.

చంద్రబాబు పిల్ల చేష్టలు చేస్తున్నారని, సీఎం జగన్ ను నోటికొచ్చినట్లు తిడుతున్నారన్నారు సజ్జల. వ్యవస్థలపై చంద్రబాబుకు గౌరవమే లేదన్నారు. వృద్ధులకు టైమ్‌కి పెన్షన్లు అందకుండా చంద్రబాబు పాపానికి పాల్పడ్డారని తెలిపారు. వాలంటీర్లపై కక్షతోనే చంద్రబాబు అలా చేశారన్నారు. బాబు ఎన్ని కుట్రలు చేసినా 93 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామన్నారు. పెన్షన్లు ఇవ్వడానికి డబ్బు లేదని తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. చంద్రబాబుది రాక్షస మనస్తత్వం అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు అనుకున్న వాళ్లకే టికెట్లు ఇచ్చుకున్నారని తెలిపారు.

సమానత్వం గురించి భారతదేశానికి ఈ భూగోళంపై ఎవరి నుండి ఎలాంటి ఉపన్యాసాలు అవసరం లేదు- ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:మనం ఎప్పటినుండో విశ్వసిస్తున్న సమానత్వం గురించి భారతదేశానికి ఈ భూగోళంపై ఎవరి నుండి ఎలాంటి ఉపన్యాసాలు అవసరం లేదని ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధన్‌ఖర్ ఈరోజు నొక్కి చెప్పారు. దేశాలను లోపలికి చూడమని కోరుతూ, "కొన్ని దేశాలకు ఇంకా మహిళా అధ్యక్షురాలు లేదు, అయితే యుకే కంటే ముందు మనకు మహిళా ప్రధానమంత్రి ఉన్నారు. ఇతర దేశాల్లోని సుప్రీం కోర్టు మహిళా న్యాయమూర్తి లేకుండానే 200 ఏళ్లు పూర్తి చేసుకుంది, కానీ మాకు ఉంది.

పౌరసత్వ సవరణ చట్టం గురించి తప్పుడు కథనం మరియు తప్పుడు సమాచారానికి వ్యతిరేకంగా హెచ్చరిస్తూ, శ్రీ ధన్‌కర్ అంం ఏ భారతీయ పౌరుడిని అతని లేదా ఆమె పౌరసత్వాన్ని హరించడానికి ప్రయత్నించదు లేదా మునుపటిలా భారతీయ పౌరుత్వం కోసం దరఖాస్తు చేయకుండా ఎవరినీ మినహాయించదు. పొరుగు దేశాల్లోని మైనారిటీలకు భారత పౌరసత్వం పొందేందుకు CAA సులభతరం చేస్తుందని ప్రస్తావిస్తూ, "మతపరమైన నిబద్ధత కారణంగా మన పరిసరాల్లో హింసకు గురవుతున్న వారికి ఇది ఎలా ఉపశమనాన్ని ఇస్తుంది, వైద్యం చేయడం వివక్ష చూపుతుంది?" అని విపి ప్రశ్నించారు.

31 డిసెంబర్ 2014న లేదా అంతకు ముందు భారతదేశానికి వచ్చిన వారికి CAA వర్తిస్తుందని పేర్కొంటూ, ఇది ప్రవాహానికి ఆహ్వానం కాదని నొక్కి చెప్పారు. "మేము ఈ కథనాలను తటస్థీకరించాలి. ఇవి అజ్ఞానం వల్ల కాదు, మన దేశాన్ని అణచివేసే వ్యూహంతో ఉద్భవించాయి, 'అని ఆయన హెచ్చరించారు.

ఈరోజు ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో 2023 బ్యాచ్ ఐఎఎస్ ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి వారి ప్రొఫెషనల్ కోర్సు యొక్క ఫేజ్-1 ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ వ్యతిరేక కథనాల యొక్క వ్యూహాత్మకమైన వాగ్యుద్ధాలను తిప్పికొట్టాలని యువకులకు పిలుపునిచ్చారు. మన ఘనత మరియు దృఢమైన రాజ్యాంగ సంస్థలను కలుషితం చేయడం మరియు కళంకం చేయడం.

ఇటీవలి సంవత్సరాలలో పాలన మెరుగ్గా మారిందని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ప్రత్యేక వంశపారంపర్యత ఇప్పుడు బై లేన్‌లలో మునిగిపోతోందని అన్నారు. "చట్టం ముందు సమానత్వం ఆదర్శప్రాయంగా అమలు చేయబడింది మరియు అవినీతి ఇకపై వ్యాపార వస్తువు కాదు కాబట్టి ప్రజాస్వామ్య విలువలు మరియు సారాంశం మరింత లోతుగా మారుతున్నాయి. ఇంతకు ముందు కాంట్రాక్ట్, రిక్రూట్‌మెంట్, అవకాశా లకు వెళ్లే ఏకైక యంత్రాంగం ఇదే," అన్నారాయన.

కొంతమంది విశేష వంశపారంపర్యంగా తాము న్యాయ ప్రక్రియకు అతీతంగా ఉన్నామని మరియు చట్టం వారిని చేరుకోలేదని ముందుగా భావించారని పేర్కొంటూ, "మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ఇతరులకన్నా ఎలా సమానంగా ఉంటారు?" అని ఉప రాష్ట్రపతి ప్రశ్నించారు. ఈ విప్లవానికి సివిల్ సర్వెంట్ల కృషిని గుర్తిస్తూ, చాలా కాలంగా మనకు దూరంగా ఉన్న ఈ సమానత్వం మరియు పరిపాలన యొక్క సిరల్లోకి రక్తంలా పరిగెత్తుతున్న అవినీతి ఇప్పుడు గతానికి సంబంధించిన విషయాలు అని ఆయన యువ అధికారులతో అన్నారు.

త్వరలో ఓడలు బండ్లు అవుతాయి..ఎమ్మెల్యే పోచారం

కామారెడ్డి, ఏప్రిల్ 6:త్వరలో ఓడలు బండ్లు అవుతాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జోస్యం చెప్పారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రైతు నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత మూడు నెలల్లో తెలంగాణలో మంచి రోజులు రాబోతున్నాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుని 4 నెలలు అవుతున్నా.. హామీలు మాత్రం అమలు చేయలేదని ఆరోపించారు. అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల వీడియోను ప్రదర్శించారు.రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్ట్‌ల్లో సాగు నీటి కొరత ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం నుంచి నీరు తెచ్చి 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. లేకుంటే నిజాంసాగర్ ప్రాజెక్టు క్రింద రైతుల పరిస్థితి మరోలా ఉండేదన్నారు. పోచారం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోతారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కేసీఆర్ కష్టకాలంలో ఉన్నారు.. అందరం మానవత్వంతో మద్దతుగా ఉండాలని పోచారం విజ్ఞప్తి చేశారు.



తెలంగాణ సారస్వత పరిషత్తు
హైదరాబాదు.
ఆహ్వానం
ప్రఖ్యాత కవి రచయితలు, విమర్శకులు, పరిశోధకులు స్వీయ జీవిత, సాహిత్య ప్రస్థానం గురించి వివరించే ప్రసంగ పరంపర
నేను... నా రచనలు...
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు
విశిష్ట అతిథి
డా. సి. వసుంధర
అధ్యక్షులు, తెలుగు జానపద సాహిత్య పరిషత్తు, హైదరాబాద్
వక్త
శ్రీమతి స్వాతి శ్రీపాద
ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, అనువాదకురాలు
సమావేశకర్త
డా. ఎ. సిల్మానాయక్
ప్రధానాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల
తేది : 2024 ఏప్రిల్ 8, సాయంత్రం 5.30 గంటలకు
వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాదు
ఈ కార్యక్రమానికి తప్పక విచ్చేయవలసిందిగా కోరుతూ సాదరంగా ఆహ్వానిస్తున్నాం
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

రాజ్యసభ సభ్యుడిగా జేపీ నడ్డా ప్రమాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా పెద్దల సభకు నామినేట్ అయిన విషయం తెలిసిందే. గుజరాత్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇందులో భాగంగా రాజ్యసభ సభ్యుడిగా శనివారం ప్రమాణం చేశారు. నడ్డాతో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ప్రమాణం చేయించారు.

కాగా, గతంలో నడ్డా హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. ఆయన పదవీ కాలం ఈ నెల (ఏప్రిల్)తో ముగిసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీకాలం ముగిసిన 57 మంది రాజ్యసభ సభ్యుల్లో ఆయన ఒకరు. దీంతో నెల ముందే ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో ఆయన్ని బీజేపీ ప్రభుత్వం గుజరాత్ నుంచి రాజ్యసభకు నామినేట్ చేసింది.

టిఆర్ఎస్‌గా మారనున్న బిఆర్ఎస్ పార్టీ !

-ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికించేందుకు కుట్ర
- జైలుకు పోతే పోతా..ఎర్రబెల్లి దయాకర్ రావు

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బిఆర్ఎస్ పార్టీని టిఆర్ఎస్ గా మార్చే ఆలోచన చేస్తున్నామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారని ఎర్రబెల్లి వెల్లడించారు. జైలుకు పోతే పోతా.. కానీ పార్టీ మారను అని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. గతంలో రైతుల కోసం పోలీసులతో దెబ్బలు తిని మూడు సార్లు జైలుకు వెళ్లి వచ్చానని గుర్తుచేశారు. హామీల అమలు అడిగితే కేసులతో భయపెడుతున్నారని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్ గూటికి సరూర్నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్ రెడ్డి?

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మహేశ్వరం నియోజకవర్గం సరూర్నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు విశ్వాసం సమాచారం. అనిత దయాకర్ రెడ్డి పార్టీ మారడం అనివార్యమైతే సబితా ఇంద్రారెడ్డికి కోలుకొని దెబ్బ. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సబితా రెడ్డి విజయానికి అనిత దయాకర్ రెడ్డిలు ముఖ్య భూమిక పోషించారు. మీరు పార్టీ మారడానికి ఎమ్మెల్యే నియత్రుత్వ పోకడ ఒక కారణమని అనిత రెడ్డి అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.వీరు కాంగ్రెస్ పార్టీలోకి రావటానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి లు వత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. మీరు పార్టీ మారడంతో భారతీయ రాష్ట్ర సమితికి కనీసం బూతు స్థాయి సభ్యులు కూడా దొరకని పరిస్థితి కనిపిస్తుంది.అనిత దయాకర్ రెడ్డిల చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ఎంతో దోహదపడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మాదాపూర్ ఎస్ఐ

హైదరాబాద్, ఏప్రిల్ 6: మాదాపూర్ ఎస్ఐ రంజిత్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఎస్ఐ రంజిత్‌తో పాటు రైటర్ విక్రమ్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిని అధికారులు విచారిస్తున్నారు. మాదాపూర్ పీఎస్ సిబ్బంది అవినీతిపై రెండు రోజులుగా ఏసీబీ అధికారులు నిఘా ఉంచారు.మాదాపూర్ సాయి నగర్‌లో లక్ష్మణ్ నాయక్ ఇంటి నిర్మాణం చేపట్టారు. తన స్థలంలో ఇల్లు కడుతున్నాడని లక్ష్మణ్‌పై సుధా అనే మహిళ ఫిర్యాదు చేసింది. సుధా ఫిర్యాదు మేరకు లక్ష్మణ్ నాయక్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు రావాలంటూ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్ కలిసి లక్ష్మణ్‌కు ఫోన్ చేశారు. రూ. లక్ష ఇవ్వాలని లక్ష్మణ్ నాయక్‌ను డిమాండ్ చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. డబ్బులు ఇవ్వకపోతే లక్ష్మణ్ కూతురు, అల్లుడిపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ బెదిరించాడు. దీంతో ఎస్ఐ, రైటర్‌పై లక్ష్మణ్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక ప్రకారం ఎస్ఐ రంజిత్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 6:ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, బీజేపీ 44వ ఆవిర్భావ వేడుకల్లో, కాచిగూడలోని 214 పోలింగ్ కేంద్రంలో టిఫిన్ బాక్స్ బైఠక్‌లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గొప్పగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయించలేని రాహుల్ గాంధీ.. ఏ ముఖం పెట్టుకొని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని కీలక వ్యాఖ్యలు చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ.. పథకాల అమలుపై లేదని అన్నారు. రాష్ట్ర ప్రజల దృష్టి ఇప్పుడు బీజేపీపై ఉందని.. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీకే ఓటేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మెజార్టీ సీట్లు గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోసం మేనిఫెస్టోను ప్రకటించడం కాదని.. ముందు తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. మళ్లీ ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ఆపన్న హస్తం కాదు.. భస్మాసుర హస్తం..

కాంగ్రెస్ పై బండి ఆగ్రహం..

-కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ మోసపూరిత పార్టీలే?

-ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాంగ్రెస్ డ్రామాలు?

-నా ఫోన్ ను కూడా గత ప్రభుత్వం ట్యాపింగ్ చేసింది

-కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరపాల్సిందే

-10న సిరిసిల్లలో 'దీక్ష' చేయనున్న బండి..

కరీంనగర్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసాలకు కేరాఫ్ అడ్రస్ అని, ఆ పార్టీది 'ఆపన్న హస్తం కాదని, భస్మాసుర హస్తమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. మధ్యాహ్నం కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాటాడారు.. హామీలను అమలు చేయకుండా 'పాంచ్ న్యాయ్' పేరుతో మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. తెలంగాణను 10 ఏళ్లపాటు పాలించిన కేసీఆర్ రాష్ట్రంలో రైతుల దుస్థితికి ప్రధాన కారణమన్నారు. 30 లక్షల ఎకరాల్లో పంట నష్టపోతే ఏనాడూ సాయమందించని కేసీఆర్ సిగ్గు లేకుండా రైతులపట్ల ప్రేమను ఒలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ మోసపూరిత పార్టీలేనని, రైతులు, నేతన్నల దుస్థితికి రెండు పార్టీలే కారణమని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని నేతన్నల దుస్థితికి నిరసనగా, వారిని ఆదుకోవాలనే ప్రధాన డిమాండ్ తో ఈనెల 10న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిరిసిల్లో 'దీక్ష' చేస్తున్నట్లు ప్రకటించారు. నయీం ఆస్తులపై విచారణ జరపడంతోపాటు ఆస్తులను దోచుకున్న కేసీఆర్ కుటుంబంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించండి -గవర్నర్‌కు బీజేపీ లేఖ

-ఇప్పటికే ఈ కేసులో నలుగు పోలీస్ అధికారులు అరెస్ట్

-మరికొందరు అరెస్ట్ కు సిద్ధం

-ఈ ట్యాపింగ్ లో గత పాలకులు ప్రమేయం

-దీనిపై నిజాలు బయటకు రావాలంటే సిబిఐ విచారణ జరగాల్సిందే

హైదరాబాద్, ఏప్రిల్ 6:రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర బిజెపి తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ ను కోరింది.. ఈ మేరకు ఆయనకు ఒక లేఖ రాసింది.. ఈ లేఖలో ట్యాపింగ్ పూర్వపరాలను వివరించింది.. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీస్ ఉన్నతాధికారులు అరెస్ట్ అయ్యారని తెలిపింది.. మరికొందరు పోలీసుల పై దర్యాప్తు కొనసాగుతున్నదని వెల్లడించింది.. ఈ ట్యాపింగ్ లో గత పాలకుల ప్రమేయం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని బిజెపి తెలిపింది.. ఈ కేసులో నిజనిజాలు వెలుగులోకి రావాలంటే సిబిఐ విచారణ జరపాలని గవర్నర్ ను అభ్యర్థించింది.. ఈ లేఖపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపి లక్ష్మణ్ తో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతకాలు చేశారు..

కాంగ్రెస్ వచ్చింది.. కరువొచ్చింది- మాజీమంత్రి హరీష్‌రావు..

సంగారెడ్డి, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పందరోజుల పాలనలో కరెంటు లేదు, నీళ్లు లేవు, ఆఖరికి రైతులకు కన్నీళ్లే మిగిలాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. ఇవాళ సంగారెడ్డిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుదీక్షలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200 మంది రైతులు చనిపోయారనీ. వారి కుటుంబాలను ఏ మంత్రీ పరామర్శించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం చెల్లించాలి. చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ. 20 లక్షలు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు, చిల్లర మాటలు మానాలని అన్నారు. మామీద విమర్శలు చేయండి, తిట్టండి. కానీ రైతుల గురించి ఆలోచించండి, వాళ్ళను ఆదుకోండి. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టకోండని సూచించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, పట్లకు, మక్కలకు రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతుల రూ.15 వేలు ఇస్తామని చెప్పిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేని, కేసీఆర్ రైతులు దగ్గరికి వస్తున్నాడు కాబట్టి బీజేపీకి రైతులు ఇప్పుడు గుర్తొస్తున్నారన్నారు. . కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్ల కొనబోమని చెప్పింది బీజేపీ కాదా? కేసీఆర్ హయాంలో పంటలు పండడం తప్ప ఎండడు లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చింది, కరువొచ్చిందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తప్పకుండా గుణపాఠం చెప్తారన్నారు. మాట తప్పిన మీకు మళ్లీ మేనిఫెస్టో పెట్టే నైతిక అర్హత లేదని, రైతులకు మేలు చేసే దాకా బీఆర్ఎస్ పోరాడుతుందని రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, మీకు అండగా మేముంటామని తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి.. మాజీ ఎమ్మెల్యే చందర్

కరీంనగర్, ఏప్రిల్ 6:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని రామగుండం మాజీ శాసనసభ్యులు కొరకంటి చందర్ డిమాండ్ చేసారు. శనివారం బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ పిలుపుమేరకు గోదావరిఖనిలో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని, వెంటనే రైతుబంధు నిధులు కర్షకుల ఖాతాల్లో జమ చేయాలని, కౌలు రైతులకు హామీ ఇచ్చిన విధంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ధాన్యానికి మద్దతు ధర అందించడంతోపాటు 500 రూపాయల బోనస్ చెల్లించాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల రైతులు సాగునీరు అందక పంట నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా హామీలు పూర్తి చేయని కాంగ్రెస్ కు పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నిరసన దీక్షలో బారాస నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని చిన్నారి మృతి..

హైదరాబాద్, ఏప్రిల్ 6:కోరుట లో ఆటో ఢీకొని చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఇవాళ చోటుచ ేసుకుంది. ఇంటి ముందు 16 నెలల బాలుడు ఆడుకుంటుండగా తాగునీరు సరఫరా చేసే ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు.స్థానిక ఎస్సై కిరణ్ కుమార్ తెలి పిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన పొట్ట రిశేంద్ర -అపూర్వ దంపతుల కుమారుడైన సుధన్వన్ (16 నెలలు) శనివారం ఇంటి ముందు ఆడుకుంటుండగా అటుగా వచ్చిన ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి బాలుడిని ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఘటనతో కోరుట్లలో విషాద చాయలు అలుముకున్నాయి.

అబద్ధాలతో రైతుల నోట్లో మట్టికొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వినోద్ కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 6: ఎలాగూ అధికారంలోకి రామనే ఉద్దేశ్యంతో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు అబద్ధాలు చెప్పి?తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రైతుల నోట్లో మట్టికొడుతున్నారని రైతుల ఉసురు పోసుకుంటే ప్రభుత్వానికి పుట్టగతులుండవని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్, మానకొండూర్ నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణ రావుల నివాసాల్లో రైతు నిరసన దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ? ఇది కాలం తెచ్చిన కరువు కాదని? కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షగట్టి తెచ్చిన కరువన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పంద రోజుల్లోనే రైతుల బ్రతుకులు ఆగమైపోతున్నాయన్నారు. సాగునీళ్లు లేక ఎండిన పంటలకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.25000ల పంట నష్ట పరిహారంతో పాటు యాసంగి వరి పంటకు క్వింటాలు కు రూ.500ల భోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ మద్దతు ధర కంటే ఏ ఒక్క రైతు పంట అమ్ముకోరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడానికే కమిటీల పేరుతో కాలయాపన చేసేందుకు కుట్రపూరితంగా వ్యవ హరిస్తోందని పేర్కొన్నారు. అధికారం లోకి వచ్చిన రెండు రోజుల్లోనే డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం.. రైతులు బ్యాంకులకు వెళ్లి రుణాలు తెచ్చుకోవాలని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు రైతు రుణమా ఫీపై ఎందుకు స్పందించడం లేదన్నా రు. మాయమాటలు మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతులకు ఎండిన పంటలకు రూ.25000ల నష్ట పరిహారం, క్వింటాలు కు రూ.500ల భోనస్, 2లక్షల రైతు రుణమాఫీ చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటి పంటలు ఎండిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో సీఎంగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ నిర్మాణం చేయొద్దని అప్పటి మహారాష్ట్ర సీఎం పృద్విరాజ్ చౌహాన్ కు లేఖలు రాశారని, మహారాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఎకరం కూడా భూసేకర చేసేది లేదని వారు అప్పుడు మెలిక పెట్టడంతోనే ఆగిపోయిందన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో గవర్నర్ విద్యాసాగర్ రావు, ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్ ల వద్దకు వెళ్లి ఒప్పించి భూసేకరణ చేయించి మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మాణం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇక నుంచి పోరుబాట తప్పదని.. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాక విడిచి పెట్టేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ రవిందర్ సింగ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనీల్ గౌడ్, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మానకొండూర్ జడ్పీటీసి శేఖర్ గౌడ్, గడ్డం నాగరాజు, లింగాల లక్ష్మణ్, మహిపాల్ రెడ్డి, గంప వెంకన్న, గంట మహిపాల్, దేవేందర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, నజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే 25 గ్యారంటీలను అమలు చేస్తాం

-కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

జైపూర్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తమ పార్టీ అధికారంలోకి వస్తే 25 గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. శనివారం జైపూర్ లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్యారంటీలను అమలు చేస్తామని తాము హామి ఇచ్చామని.. ప్రధాని మోడీలా తాము అబద్దాలు చెప్పడం లేదన్నారు. మోడీ అనేక గ్యారంటీలను ప్రకటించారని, ఇప్పటివరకు ఆయన ఏ గ్యారంటీని పూర్తిగా అమలు చేశారని మిమ్మల్ని అడగాలనుకుంటానన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ.. గత 10 ఏళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని.. మరి, 20 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా? లేదా? అని ప్రజలనుద్దేశించి ఖర్గే అడిగారు.బెదరింపులతో ప్రతిపక్ష నేతలు బిజెపిలో చేరుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ అన్నారు. నేడు మన దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని..మన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆమె చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లకు హడ్కో నిధులు

-రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తుపై తొలి దశలో రూ. 3000 కోట్లను రుణం

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత తీరనున్నది. రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తుపై తొలి దశలో రూ. 3000 కోట్లను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు రుణం ఇచ్చేందుకు హడ్కో అంగీకరించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున ఏటా 4.50 లక్షల ఇళ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత నెలలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ప్రారంభించింది. లోక్ సభ ఎన్నికలు ముగిసిన తరువాత అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించింది.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిధుల కొరత రాకుండా హడ్కో నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతంలో నిర్మించే ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. కేంద్ర నుంచి ఈ మొత్తాన్ని కూడా సేకరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది.

ఇళ్ల నిర్మాణానికి దశల వారీగా రుణం ఇవ్వాలని కూడా హడ్కో నిర్ణయించింది. తొలి దశలో రూ. 850 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయని సమాచారం. ఇందిరమ్మ ఇళ్లను ఇళ్లు లేని వారికి ఇస్తారా, లేక ఇళ్లు లేని మహిళల పేరిటే ఇస్తారా? అన్నది శేష ప్రశ్న. ఎందుకంటే ఒంటరి పురుషులు, వృద్ధులను లెక్కలోకి తీసుకోరా అన్నది కొందరి ప్రశ్న.

ఊటీ ట్రిప్‌కు కేవలం రూ.13 వేలే !..

ఐఆర్సీటీసి టూర్ ప్యాకేజీ

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): వేసవి వేడిమిని తట్టుకోలేక చాలా మంది వేసవి కాలంలో చల్లని విడుదలకు వెళ్లాలని అనుకుంటారు. పేదలకైతే సాధ్యం కాదు కానీ, కాస్త వెసలుబాటు ఉన్నవారికి ఇది సాధ్యమే. సాధారణంగా చాలా మంది సిమ్లా, ఊటీ, కశ్మీర్ వంటి ప్రాంతాలకు ట్రిప్ వేస్తుంటారు. కాగా ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్ సిటిసి) ఓ బెస్ట్ ప్యాకేజీని తీసుకొచ్చింది. దాని ప్రకారం ప్రయాణం,భోజనంతో పాటు వసతి ఉండనున్నది. ఐఆర్ సిటిసి అందించే తాజా టూర్ ప్యాకేజీ ఏప్రిల్ 9 నుంచి మే 28 వరకు అందుబాటులో ఉండనున్నది. 'అల్టిమేట్ ఊటీ ఎక్స్ హైదరాబాద్'పేరిట ఈ టూర్ ప్యాకేజీ అందిస్తున్నారు. సికింద్రాబాద్, గుంటూరు, నల్గొండ, తెనాలి రైల్వే స్టేషన్లలో యాత్రికులు ఈ రైలు ఎక్కొచ్చు. సమయం తక్కువ కనుక వెంటనే ఆఫర్ ను వినియోగించుకోండి ! ఏప్రిల్ 9కి సంబంధించిన టికెట్లు అమ్ముడయిపోయాయి. ఇక మిగిలింది ఏప్రిల్ 16,23,30 మే14,21,28 తేదీలవి మాత్రం అందుబాటులో ఉన్నాయి.ఊటీని 'హిల్ స్టేషన్ క్వీన్' అంటారు. నీలగిరి జిల్లా రాజధాని ఊటీ. దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. నీలగిరి పర్వతాల్లో రైలు ప్రయాణం అదనపు ఆకర్షణ. ఊటీ ప్రదేశం సముద్ర మట్టానికి 2240 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఊటీలో సుందరమైన ప్రాంతాలను ఎంజాయ్ చేయొచ్చు.

కడపలో కొత్తగా తీర్చిదిద్దిన కల్యాణ్ జ్యుయలర్స్ షోరూమ్‌ను ప్రారంభించిన నటి శ్రీలీల

అమరావతి, ఏప్రిల్ 6:భారత దేశంలో అత్యంత విశ్వసనీయమైన, దిగ్గజ జ్యుయలరీ సంస్థల్లో ఒకటైన కల్యాణ్ జ్యుయలర్స్, ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో కొత్తగా తీర్చిదిద్దిన షోరూమ్ ను ప్రారంభించింది. ప్రముఖ నటి శ్రీలీల ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. కల్యాణ్ జ్యుయలర్స్‌కి చెందిన విస్తృత శ్రేణి డిజైన్లు ఇందులో అందుబాటులో ఉంటాయి. కొనుగోలుదారులకు అత్యుత్తమమైన, ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభూతిని అందించేలా సకల సదుపాయాలతో ఈ షోరూమ్ తీర్చిదిద్దబడింది. కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి నటి శ్రీలీల మాట్లాడుతూ కల్యాణ్ జ్యుయలర్స్ కొత్త షోరూమ్ భారీ ప్రారంభోత్సవానికి హాజరు కావడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. విశ్వసనీయత, నిజాయితీ, కస్టమర్ల పట్ల నిబద్ధత కలిగిన బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహిం చగలగడం ఎంతో గర్వకారణమన్నారు. ఆకర్షణీయమైన ఆభరణాల కలెక్షన్‌తో ఇక్కడి ఆభరణాల ప్రేమికులను కల్యాణ్ జ్యుయలర్స్ నిస్సందేహంగా ఆకట్టుకోగలదని తెలిపారు.

కల్యాణ్ జ్యుయలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కల్యాణరామన్ మాటాడుతూ. ఆంధ్రప్రదేశ్‌లో సరికొ త్తగా తీర్చిదిద్దిన కల్యాణ్ జ్యుయలర్స్ షోరూమ్‌ను ప్రారంభించడం ద్వారా తమ కస్టమర్ల అవసరాలకు తగ్గట్లుగా ఆభరణాలను అందించే సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తేవడం, వారికి అత్యుత్తమ షాపింగ్ అనుభూ తిని కలిగించడమనేది తమ లక్ష్యమ న్నారు. విశ్వసనీయత, పారదర్శకత అనే మూలసూత్రాలకు కట్టుబడి ఉంటూనే కస్టమర్లకు ప్రపంచ స్థాయి అనుభూతిని అందించేందుకు ఎప్పటిక ప్పుడు తమను తాము సరికొత్తగా తీర్చి దిద్దుకుంటూనే ఉంటున్నామన్నారు. నాణ్యత, సేవపై ప్రధానంగా దృష్టి పెట్టి విస్తృతమైన, విశిష్టమైన ఆభర ణాల డిజైన్లను అందించడం కొనసాగి స్తామని తెలిపారు. ఈ షోరూమ్‌లో పేరొందిన కల్యాణ్ జ్యుయలర్స్ హౌస్ బ్రాండ్స్ అన్నీ లభిస్తాయి. ముహూరత్ (వెడ్డింగ్ జ్యుయలరీ కలెక్షన్), ముద్ర (హ్యాండ్ క్రాఫ్టెట్ యాంటిక్ జ్యుయలరీ), నిమహ్ (టెంపుల్ జ్యుయలరీ) అనోఖి మొదలైనవి వీటిలో ఉన్నాయి.

జగన్ పాలన అంతా అవినీతిమయమే- పురందేశ్వరి

-కేంద్ర నిధులు సైతం దుర్వినియోగం
-పేదల ఇళ్లను మింగేశారు
-మడ అడవులను వదలలేదు
-రాజమండ్రి పరిధిలో అన్ని సీట్లు గెలవాల్సిందే ..
-బిజెపి ఎపి చీఫ్ పురందేశ్వరి

రాజమండ్రి, ఏప్రిల్ 6: జగన్ పాలన అంతా అవినీతిమయమని ఆరోపించారు బిజెపి ఎపి అధ్యక్షురాలు, రాజమండ్రి లోక్ సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి. రాజమండ్రిలో బీజేపీ కార్యాలయంను రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, పరిశీలకుడు సిద్ధార్థ నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ

దినోత్సవం నాడు పార్టీ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కాగా, 22 లక్షలు ఇళ్ళు కేంద్ర మంజూరు చేస్తే మూడున్నర లక్షలు మాత్రమే నిర్మించారని ఆమె పేర్కొన్నారు. జగన్ కాలనీల్లో అవినీతి ఉందన్నారు. ల్యాండ్ లెవెలింగ్ చేయటానికి కూడా నిధులు దోచేశారని, మడ అడవులు అడవుల్లో జగనన్న కాలనీల నిర్మాణం ఎలా జరిపారన్నారు.

అన్ని స్థానాలు గెలవాల్సిందే ..

పార్లమెంట్ పరిధిలో ఏడుగురు అభ్యర్థులను గెలిపించుకోవాలని పురందేశ్వరి కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. కాకినాడ , రాజమండ్రి కలిపేస్తామని ఇక్కడి నాయకులు అలవిగాని వాగ్దానాలు చేస్తున్నారని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోఆరు. , రాజమండ్రి పార్లమెంటు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. రాజమండ్రి లోక్ సభ పరిధిలో ఉన్న ఇద్దరు జనసేన అభ్యర్థులు, టిడిపి అభ్యర్థులతో కలిపి పని చేస్తానని అన్నారు.., రాజమండ్రిలో కేంద్ర నిధులతో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందన్నారు. నందమూరి తారక రామారావు బిడ్డగా మీ ముందుకు వచ్చానని , తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు..

విశాఖలో ఖైదీ పరారీ! సెంట్రల్ జైలులోనే పక్కా ప్లాన్..

అమరావతి, ఏప్రిల్ 6: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని విశాఖ కేజీహెచ్ .. క్రమేపీ నేరగాళ్ల అడ్డగా మారిపోయిందంటే కేవలం ఆరోపణ కాదు. అనారోగ్యం పేరుతో కేజీహెచ్ లో చేరి.. పోలీసుల కళ్లగప్పి పారిపోయే నేరగాళ్లకు అనువైన ప్రాంతంగా మారిపోయింది. తాజాగా ఇలాంటి ఘటనే శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు చోటు చేసుకుంది. ఇక్కడ చికిత్స పొందుతున్న ఓ కరుడుగట్టిన ఖైదీ వాష్ రూమ్ కి వెళ్లి తనకు సెక్యూరిటీ పోలీసును పక్కకు నెట్టి అక్కడి నుంచి పారిపోయాడు. ప్రస్తుతం ఈ ఘటన విశాఖలో కలకలం రేపింది. కేజీహెచ్ లో ఈ ఘటనతో పోలీసులు, విశాఖ జిల్లా యంత్రాంగం, కేజీహెచ్ సిబ్బంది అవాక్కయ్యారు. అప్రమత్తమయ్యారు.

తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం, పెదవలస గ్రామానికి చెందిన బోన్నిధి మహాలక్ష్మి అలియాస్ రాజు పోలీసులు కళ్లుగప్పి ఆసుపత్రి నుంచి పారిపోయాడు. పోస్కో కేసులో కోర్టు రెండేళ్ల శిక్షను విధించింది. విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. 2022 జూన్ 13 నుంచి ఈ జైలులో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. జైలు నుంచి పారిపోవటానికి పక్కా ప్లాన్ రచించాడు. 2024 మార్చి 11న మెటల్ గోర్లు, జీఐ వైర్ ముక్కలు తిన్నాడు. కడుపునొప్పి బాధపడుతున్నాడని చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించి రాజేంద్ర ప్రసాద్ వార్డులో చేర్పించారు. మార్చి 22న శస్త్రచికిత్స నిమిత్తం సూపర్ స్పెషాలిటీ వార్డులోకి నిందితుడిని మార్చారు. ఇక ఏప్రిల్ 5 న రాత్రి రెండు గంటల సమయంలో డ్యూటీలోని ఎస్కార్ట్ పోలీస్ కు వాష్ రూమ్‌కి వెళ్లాలని చెప్పి అతడిని తోసేసి ఆ వార్డు నుంచి నిందితుడు పారిపోయాడు.వెంటనే ఎస్కార్ట్ రాజనా కళ్యాణ్ (39) పోలీసులకు సమాచారం ఇచ్చారు.కేజీహెచ్ లో భద్రత డొల్లతనం మరోసారి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. అక్కడ సీసీ కెమెరాలు సరిగా పనిచేయవు. సిబ్బంది నిర్లక్ష్యమూ యథాతథం. అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒకవేళ ఏదైనా జరిగినా మనకెందుకులే అని పట్టించుకోరు. ఇలాంటి స్థితిలో కేజీహెచ్ ప్రతిష్ట నీరుగారు తోంది. రెండేళ్ల జైలు శిక్ష పడిన ఖైదీ అక్కడ నుంచి పరారీ కావటమే ఇందుకు నిదర్శనం. దీనికి తోడు ఘటన జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం మరీ విడ్డూరం. కేజీహెచ్ లో పోలీసు ఆధీనంలోని నేరస్తులే తప్పించుకుని అక్కడి నుంచి పారిపోయారంటే ఆ హాస్పటల్లో పరిస్థితులు నేడు ఎలా ఉన్నాయో అర్థమవుతోంది. పెద్ద ఆస్పత్రిలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా.. లేనట్టుగానే మారింది.

గెలుపే లక్ష్యంగా గులాబీ సత్తాచాటేలా..

-సమన్వయ సమావేశాలతో బీఆర్ఎస్ దూకుడు

హైదరాబాద్, ఏప్రిల్ 6:లోకసభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్ ప్రచారంలో జోరు పెంచారు. ప్రజాప్రతినిధులతో కలిసి రోజుకో నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. వాకర్స్‌తో సమావేశాలు, నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు శ్రేణులతో సమన్వయ సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇలా బీఆర్ఎస్ అభ్యర్థులు ముందంజలో ఉంటే..బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కనీస ప్రచారంలో లేరు. దీంతో ఆ రెండు పార్టీల్లోనూ స్తబ్ధత నెలకొన్నది.మొత్తంగా లక్ష్యంపై గులాబీ జెండా ఎగురవేయడంతో పాటు మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా బీఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా కార్యాచ రణతో క్యాంపెయిన్ చేస్తున్నది. ఇందులో భాగంగానే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఇప్పటికే జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సమన్వయ సమావేశాలను నిర్వహి ంచారు. శనివారం సనత్‌నగర్‌లో, 7న ఖైరతాబాద్, 8న నాంపల్లి, 10న అంబర్‌పేట నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలో గులాబీ సత్తా చాటేలా కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

మాయల ఫకీరులాగా చంద్రబాబు హామీలు ఇస్తున్నారు.. సజ్జల సెటైర్లు

అమరావతి, ఏప్రిల్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిరాశ నిస్పృహలతో మాట్లాడుతున్నారని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమిలో జనసేన, బీజేపీకి అసలు ఉనికే లేకుండా చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అనుకున్నవాళ్లకే టికెట్లు ఇచ్చుకున్నారని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థులను కూడా చంద్రబాబే నిర్ణయిస్తున్నాడని చెప్పారు. తాను ఏది చెబితే అదే జరగాలని చంద్రబాబు కోరుకుంటున్నారని అన్నారు. ప్రజలు ఏం అనుకుంటారనే ఆలోచన లేకుండా బాబు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబాబు పిల్లచేష్టలు చేస్తున్నారని, ముఖ్యమంత్రిని నోటికొచ్చినట్టు తిడుతున్నారని సజ్జల మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు కూడా అధికారులను కంట్రోల్ చేయాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులపై చంద్రబాబు అండ్ కో తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని చెప్పారు. వ్యవస్థలపై చంద్రబాబుకు గౌరవమే లేదని మండిపడ్డారు. వృద్ధులకు టైమ్‌కు పెన్షన్లు అందకుండా చంద్రబాబు పాపానికి పాల్పడ్డారని విమర్శించారు. వాలంటీర్లపై కక్షతో బాబు ఈ పాపానికి పాల్పడ్డారని ఆరోపించారు. బాబు ఎన్ని కుట్రలు చేసినా 93 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. పెన్షన్లు ఇవ్వడానికి డబ్బు లేదని తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు.

చంద్రబాబుది రాక్షస మనస్తత్వం అని వ్యాఖ్యానించారు. చంద్రబాబును వృద్ధులు బండ బూతులు తిడుతున్నారని చెప్పారు. పెన్షన్ల కోసం వచ్చి వృద్ధులు మరణించడానికి చంద్రబాబు కారణం కాదా? అని ప్రశ్నించారు. దగ్గుబాటి పురంధేశ్వరి కూడా చంద్రబాబు కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. బాబు ఏజెంట్ గానే అధికారులపై ఈసీకి పురంధేశ్వరి ఫిర్యాదు చేశారని తెలిపారు. పురంధేశ్వరి ఫిర్యాదు ప్రకారం ఏపీలోని అధికారులంతా అవినీతిఅ ్రరులేనా అని ప్రశ్నించారు. ఈసీ తాము చెప్పినట్టు వింటుందని పురంధేశ్వరి భావిస్తున్నారా అని నిలదీశారు. ఏపీలో వ్యవస్థలన్నీ ఇండిపెండెంట్‌గానే పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు.

బాబు మోసాలు ఎలా ఉంటాయో ప్రజలకు తెలుసని సజ్జల అన్నారు. జగన్ మాటిచ్చారంటే వెంటనే అమలు చేస్తారన్నారు. చంద్రబాబు.. మాయల ఫకీరులాగా హామీలు ఇస్తున్నారని అన్నారు. ప్రజలను నమ్మించడానికి అన్ని ఫ్రీఫ్రీ అంటున్నారని విమర్శించారు.చంద్రబాబుకు జగన్‌కు తేడా గమనించాలని కోరుతున్నా అన్నారు.

సాగర్ నీటిని ఖమ్మం జిల్లాకు తరలించడంపై ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం

-లిఫ్ట్ తెరిచి నల్గొండ జిల్లాకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్

సూర్యాపేట ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సాగర్ నీటిని ఖమ్మం జిల్లాకు తరలించడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా మంత్రులు ఇద్దరు సోయి లేకుండా పడుకున్నారని ఎద్దేవా చేశారు.

నల్గొండ జిల్లా నుండి నీళ్లు వెళున్నా ఇక్కడి ఇద్దరు మంత్రులకు సోయి లేకుండా ఉందన్నారు. పంటలకు సాగు నీరు లేక, పశువులకు తాగు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇద్దరు మంత్రులు సోయి నుండి నిద్ర లేచి లిఫ్ట్ తెరిచి నల్గొండ జిల్లాకు నీళ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సాగర్ నీటిని ఖమ్మం తరలించడంపై నల్లగొండ రైతులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న జైత్రయాత్ర- మేమంతా సిద్ధమంటూ కదలిన జనం

-నెల్లూరు జిల్లాలో అభిమాన తరంగం
-చింతరెడ్డి పాలెం నుంచి తొమ్మిదో రోజు బస్సుయాత్ర షురూ
-బస్సు వెంటే తండోపతండాలుగా ప్రజానీకం
-మహిళలు, వృద్ధులకు సీఎం పరామర్శ
-నీ వెంటే మేమంతా అంటూ జనం నీరాజనం

అమరావతి, ఏప్రిల్ 6:ఏపీలో 175కి 175 స్థానాలను గెలవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేమంతా సిద్ధం పేరిట చేపట్టిన బస్సుయాత్ర నెల్లూరు జిల్లాలో ? సీఎం జగన్ జైత్రయాత్రలా సాగుతోంది. చింతరెడ్డిపాలెం నైట్ స్టే పాయింట్ నుంచి శనివారం ఉదయం సీఎం జగన్ యాత్ర ప్రారంభమైంది. అంతక ముందు నెల్లూరు జిల్లా ఎనిమిది అసెంబ్లీ, 1 పార్లమెంట్ స్థానంలో గెలవాలన్న లక్ష్యంతో నెల్లూరు జిల్లా చింతరెడ్డిపాలెం స్టే పాయింట్ వద్ద 8 బై 8 టీషర్ట్ మీద సీఎం వైఎస్.జగన్ వైఎస్ఆర్‌సీపీ స్టాంప్‌ను వేశారు.

ఈ సందర్భంగా సీఎం జగన్‌ను నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కలిశారు. పలువురు పార్టీ నేతలు, సీనియర్ కార్యకర్తలను పేరుపేరునా పలకరిస్తూ.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న సీఎం వైఎస్.జగన్ దిశా నిర్దేశం చేశారు. భగత్‌సింగ్ కాలనీ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బస్సుయాత్ర జాతీయరహదారిపైకి చేరుకోగా భారీ సంఖ్యలో మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ బస్సు యాత్ర కోవూరు నియోజకవర్గం పడుగుపాడు చేరుకోగ, మేమంతాోయింది. సిద్ధం అంటూ జాతీయరహదారిపై తండోపతండాలుగా జనం తరలివచ్చారు.గుమ్మడికాయలతో దిష్టితీసి సీఎం వైఎస్.జగన్‌కి స్వాగతం పలికారు. నెల్లూరు జిల్లాలో ఊరూరా జనం తరలి వచ్చి జగన్ మాటల కోసం ఎదురు చూశారు. చిరునవ్వులతో జనాన్ని పలకరిస్తూ.. పరామర్శిస్తూ జగన్ బస్సు యాత్ర సాగింది. ఈ కార్యక్ర మంలో ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి , వైసీపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా కలిగిరి మండలం కుమ్మరకొండూరుకు చెందిన 20 ఏళ్ల దర్శిగుంట జయకృష్ణ 15 ఏళ్లుగా ఎదుగుదల లేక, నడక రాక అంతుపట్టని వ్యాధితో మంచానికే పరిమితం అయ్యాడు. తల్లి రాణమ్మ ఇంత వరకూ లక్షలు ఖర్చు చేసినా, ఆసుపత్రులు తిప్పినా ఫలితం లేకఎ ్రరులేనా అని ప్రశ్నించారు. ఈసీ తాము చెప్పినట్టు వింటుందని పురంధేశ్వరి భావిస్తున్నారా అని నిలదీశారు. ఏపీలో వ్యవస్థలన్నీ ఇండిపెండెంట్‌గానే పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు.

బాబు మోసాలు ఎలా ఉంటాయో ప్రజలకు తెలుసని సజ్జల అన్నారు. జగన్ మాటిచ్చారంటే వెంటనే అమలు చేస్తారన్నారు. చంద్రబాబు.. మాయల ఫకీరులాగా హామీలు ఇస్తున్నారని అన్నారు. ప్రజలను నమ్మించడానికి అన్ని ఫ్రీఫ్రీ అంటున్నారని విమర్శించారు.చంద్రబాబుకు జగన్‌కు తేడా గమనించాలని కోరుతున్నా అన్నారు.

మనిషిగా పుడితే విజ్ఞత, విచక్షణ ఉండాలిగా

-షర్మిలపై అవినాష్ ఆగ్రహం
-షర్మిల వ్యాఖ్యాలపై స్పందించిన అవినాష్ రెడ్డి
-ఆమె వ్యాఖ్యాలు వినడానికే భయకరంగా ఉన్నాయి
-తుడుచుకుంటూ పోతే తిడుతూనే ఉంటారు..
-బూడిద చల్లి తుడుచుకోమంటున్నారు
-మాట్లాడే వారిది మనిషి పుట్టుకేనా

అమరావతి, ఏప్రిల్ 6:కడప లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల తనపై చేసిన వ్యాఖ్యలపై కడప ఎంపీ అవినాష్‌రెడ్డి స్పందిస్తూ, మాట్లాడేవాళ్లు ఎంతైనా మాట్లాడుకోవచ్చని ఆ వ్యాఖ్యలను వాళ్ల విజ్ఞతకే వదిలేస్తానని, అదే మంచిదని వ్యాఖ్యానించారాయన. పులివెందులలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, తాను వైఎస్ వివేకాను హత్య చేసిన హంతకుడినంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలు అమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. . ఆ వ్యాఖ్యలు వినడానికే చాలా భయంకరంగా ఉన్నాయని చెప్పారు. మసి పూసి బూడిద జల్లి తుడుచుకొమంటారని,. తుడుచుకుంటూ పోతే తిడుతూనే ఉంటారని షర్మిలను ఉద్దేశించి అన్నారు. మాట్లాడే వాళ్లు ఎమైనా ఎంతైనా మాట్లాడుకోవచ్చని, కాకపోతే మాట్లాడే వాళ్లు మనుషులైతే విజ్ఞత, విచక్షణ ఉండాలన్నారు. మాట్లాడే వారిది మనిషి పుట్టుకే అయితే కొంచమైనా విజ్ఞత, విచక్షణ ఉంటుంది కదా అని అవినాష్‌రెడ్డి అన్నారు.

సర్కారుపై పిడికిలి బిగించి కొట్లాడుదాం.. బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్, ఏప్రిల్ 6:రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 117 రోజులు దాటినా రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రైతు సంక్షేమానికై సర్కారుపై పిడికిలి బిగించి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. వరికి క్వింటాల్ కు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల కోసం పోరుబాట పట్టారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో నిరసన చేపట్టారు. ఎన్నికల సమ యంలో రైతులకిచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని, నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రూ. రెండు లక్షల రుణమాఫీ, క్వింటాలుకు రూ.500 బోనస్, ఎకరానికి రూ.15వేల రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అబద్ధపు హామీలిచ్చి కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణలోపం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు అధికారులను నియమించి అంచనా విలువ వేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వరికి క్వింటాలుకు అదనంగా రూ.500 రూపాయల బోనస్ ఇవ్వాలన్నారు. వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీటీసీ యువ నాయకులు బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు సిర్నరాజు, వివిధ మండలాల నుండి జెడ్పీటీసీ,

ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, ముఖ్యంగా రైతు సోదరులు, బీఆర్ఎస్ పార్టీ అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, ఏప్రిల్ 6:తిరుపతిలో కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం రామచంద్రమూర్తి చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది.

అనంతరం కల్యాణ మండపంలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టర్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
కిన్నెర కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్ట్
బుధవారం 10, ఏప్రిల్ 2024, సా॥ 5-30 గంటలకు
రవీంద్రభారతి, హైదరాబాద్
కిన్నెర-శ్రీ క్రోధి నామ ఉగాది పురస్కారాలు
మరియు
పద్మశ్రీ పురస్కారాలు స్వీకరించబోతున్న
శ్రీ కూరెళ్ళ విఠలాచార్య - శ్రీమతి ఉమామహేశ్వరి - శ్రీ గడ్డం సమ్మయ్య
శ్రీ కేతవత్ సోమ్లాల్ నాయక్ - శ్రీ స్తపతివేలు ఆనందాచారి - శ్రీ దాసరి కొండప్ప గార్లకు
సత్కారం
ముఖ్యఅతిథి : శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, చైర్మన్, తెలంగాణ రాష్ట్ర శాసనమండలి
అధ్యక్షులు : డా॥ కె.వి. రమణ, ఐ.పి.ఎస్. (ఆ.)
గౌరవ అతిథి : శ్రీ భోగరాజు మూర్తి, మేనేజింగ్ డైరెక్టర్, 'శ్రీ' డెవలపర్స్
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (ఆ) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

రైతుల సమస్యల పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..

-రైతుల సమస్యల పరిష్కరించే వరకు దీక్షలు చేస్తాం
-ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
ఎంపీ నామా నాగేశ్వరరావు
పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

వైరా, ఏప్రిల్ 6: నియోజకవర్గ కేంద్రమైన వైరాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా టిఆర్ఎస్ పార్టీ శనివారం ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. రైతు దీక్షలో ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్ లాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ దీక్షలో

ఎంపి రామ నాగేశ్వరావు మాట్లాడుతూ? తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు అందక పంటలు తీవ్రంగా నష్టపోయారని, రైతులు నష్టపోయిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో విఫలమైందని విమర్శించారు. రైతుల సంక్షేమం పేరుతో హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రైతులకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలో జిల్లాలో సాగునీరు, త్రాగునీరు సమస్య తీవ్రంగా ఉందని, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే సాగునీరు, తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. హామీలు ఇచ్చి ప్రజా సమస్యలు గాలికి వదిలేసారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కరించేంత వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పార్లమెంటు సభ్యులు వద్దు రాజు రవిచంద్ర మాట్లాడుతూ? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రైతు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. రైతు దీక్ష కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కట్ట కృష్ణార్జున రావు, మాదినేని ప్రసాద్, చల్ల మోహన్ రావు, బీఆర్ఎన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టే కాలే వరకూ బిఆర్ఎస్‌లోనే -సత్యవతి రాథోడ్

హైదరాబాద్, ఏప్రిల్ 6:బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరు జంప్ అవుతున్నారు. ఆ పార్టీకి చేయిస్తూ కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు హస్తం గూటికి చేరారు. మరికొందరు క్యూలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వస్తున్న వార్తలపై మాజీమంత్రి గంగుల కమలాకర్ ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. తాను బీఆర్ఎస్ ను వీడడం లేదని, అదంతా తప్పుడు ప్రచారమని తేల్చి చెప్పారు.

కట్టె కాలే వరకు కేసీఆర్‌తోనే..

తాజాగా, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పేరు వినిపిస్తోంది. ఆమె కూడా త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరబోతున్నట్టు ఊహాగానాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆమె కూడా ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చారు. పార్టీ వీడుతున్న నేతలపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు తమ స్వార్థం కోసం పార్టీ మారుతున్నారని విమర్శించారు. తాను మాత్రం అలా చేయాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓడిన తనను కేసీఆర్ ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన మూడోసారి సీఎం కావాలని చెప్పులు కూడా వేసుకోకుండా పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. కేసీఆర్ పేరును పచ్చబొట్టు కూడా పొడిపించుకున్నానని తెలిపారు. అలాంటి తాను పార్టీ ఎందుకు మారుతానని ప్రశ్నించారు. కట్టె కాలే వరకు కేసీఆర్ వెంటనే ఉంటానని సత్యవతిరాథోడ్ తేల్చి చెప్పారు.

సినిమా విలన్ క్యారెక్టర్లు అన్నీ కలిపితే చంద్రబాబు.. జగన్ సెటైర్లు

అమరావతి, ఏప్రిల్ 6: సినిమా విలన్ క్యారెక్టర్లు అన్నీ కలిపితే చంద్రబాబు అని ఏపీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. మోసం, అబద్ధాలు, వెన్నుపోటు, కుట్రలు కలిపితే చంద్రబాబు అని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన సీఎం జగన్ బస్సు యాత్ర తొమ్మిదో రోజు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా కావలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. కావలిలో జన ప్రభంజనం కనిపిస్తోందని చెప్పారు. మోసగాళ్ల కూటమికి వ్యతిరేకంగా ఈ జిల్లా సిద్ధమంటోందని అన్నారు. విపక్షాల కుట్రలు, కుతంత్రాలు చేధించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ ఎన్నికలు మోసం చేసే చంద్రబాబు, ప్రజలకు మధ్య యుద్ధమని జగన్ అన్నారు. ఈ యుద్ధంలో తాను ఎప్పుడూ ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. మోసగాళ్లంతా చంద్రబాబు పక్షమేనని పేర్కొన్నారు. సినిమా విలన్ క్యారెక్టర్లు అన్నీ కలిపితే చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. మోసం, అబద్ధాలు, వెన్నుపోటు, కుట్రలు కలిపితే చంద్రబాబు అని విమర్శించారు.

విశ్వసనీయత, ధర్మాన్ని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పేదలకు చంద్రబాబు చేసిన ఒక్క మంచి పనిచెప్పాలని జగన్ సవాలు విసిరారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకమైనా గుర్తొస్తుందా? అని నాలుగు నెలలుగా ప్రశ్నిస్తున్నానని జగన్ తెలిపారు. వీటికి చంద్రబాబు సమాధానం చెప్పడం లేదని చెప్పారు. చంద్రబాబు మూడుసార్లు రంగు రంగుల మేనిఫెస్టో చూపించారని విమర్శించారు. ఒక్కసారైనా హామీలు అమలు చేశానని చెప్పాం.. అని ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు మేనిఫెస్టోను పట్టించుకోరని విమర్శించారు. మేనిఫెస్టో చూపించే దమ్ము, ధైర్యం ఉందా అని చంద్రబాబును ప్రశ్నించారు. మేనిఫెస్టోల కనీసం 10 శాతమైనా అమలు చేశారా అని నిలదీశారు. చంద్రబాబు ఈ ప్రశ్నలకు ఎప్పటికీ సమాధానం చెప్పలేడని విమర్శించారు.

ప్రజలతో చంద్రబాబుది అతకని బంధం అని జగన్ అన్నారు. 14 ఏండ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మార్క్ ఏంటి అని ప్రశ్నించారు. మోసాలు, వెన్నుపోట్లతో చంద్రబాబు 14 ఏండ్లు సీఎంగా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికీ చేసిన పనులు చెప్పుకునే దమ్ము చంద్రబాబుకు లేదని అన్నారు. మంచి చేసి ఉంటే 3 పార్టీలతో పొత్తు ఎందుకు అని ప్రశ్నించారు.

త్వరలో యుపిఐ విధానం ద్వారా బ్యాంకుల్లో డబ్బును డిపాజిట్ చేసే సౌకర్యం

-రెపోరేటు యథాతథంగా కొనసాగింపు
-202425కు జిడిపి అంచనా 7 శాతం
-ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

ముంబై ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: యుపిఐ (యునిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) విధానం ద్వారా బ్యాంకుల్లో డబ్బును డిపాజిట్ చేసే సౌకర్యాన్ని త్వరలో తీసుకురానున్నామని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. ఆర్‌బిఐ ఎంపిసి (ద్రవ్యపరపతి విధాన కమిటీ) సమీక్ష వివరాలను గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. యుపిఐ సిస్ట మ్ ద్వారా కూడా బ్యాంకులో డబ్బులు డి పాజిట్ చేయవచ్చని, ఈ సదుపాయంతో ప్రాంతాలకు డబ్బు పంపే సమయం ఆదా అవుతుందని ఆయన వివరించారు.

ప్రస్తుతం నగదు తీసుకుని మెషిన్‌లో వేయాలి, మొత్తం ప్రక్రియ పూర్తయితేనే డబ్బు ఖాతాకు బదిలీ అవుతుంది. అయితే ద్వారా నగదు డిపాజిట్ల కు ఆర్‌బిఐ అనుమతిని చ్చిందని శక్తికాంత తెలిపారు.

ప్రస్తుతం కార్డు రహి త నగదును ఎటిఎం నుంచి విత్‌డ్రా ప్రస్తుతం చాలా మంది వినియోగదారులు ఏటిఎంలలో డబ్బును డిపాజిట్ చేసేందుకు నగదుతోపాటు డెబిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఈ నగదు డిపాజిట్ యంత్రాలు బ్యాంకు ఉద్యోగుల పనిని తగ్గించడంలో ఎంతగానో దోహదం చేస్తున్నాయి. దీంతో బ్యాంకుల వద్ద పొడవైన క్యూలు కూడా తగ్గాయి. అందువల్ల ఈ సేవను మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నామని ఆర్‌బిఐ గవర్నర్ అన్నారు.

త్వరలో మార్గదర్శకాలు

బ్యాంకులో యుపిఐ ద్వారా డబ్బు డిపాజి ట్ చేసేందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేస్తామని ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. ప్రస్తుతం ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పిపిఐ) ద్వారా యుపిఐ చెల్లింపును పిపిఐ జారీచేసేవారి వెబ్ లేదా మొబైల్ యాప్ ద్వారా మాత్రమే చేయవచ్చు. ఇప్పుడు పిపిఐ వాలెట్ ద్వారా యుపిఐ చెల్లింపు చేయడానికి థర్డ్ పార్టీ యుపిఐ యాప్‌ను అనుమతించే ప్రతిపాదన ఉంది. అంతేకాకుండా చిన్న లావాదేవీలకు కూడా డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహిస్తామని గవర్నర్ అన్నారు.

కొత్త వ్యవస్థ ఎలా పని చేస్తుంది..

యుపిఐ ద్వారా నగదు డిపాజిట్ చేసే ఈ విధానం ప్రస్తుతం కొనసాగుతున్న విత్‌డ్రా ప్రక్రియను పోలి ఉంటుంది. ప్రస్తుతం కా ర్డ్‌లెస్ నగదును విత్‌డ్రా చేయాలనుకుంటే, యుపిఐ కార్డ్‌లెస్ నగదు ఎంపికను ఎంచుకోవాలి. దీని తర్వాత మొత్తాన్ని ఎంపిక చేసుకోవాలి. క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసిన తర్వాత యుపిఐ పిన్‌ను నమోదు చేయ డం ద్వారా డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు. డబ్బులు డిపాజిట్ చేసే విధానం కూడా ఇదే విధంగా ఉండబోతోంది.

ఇఎంఐ చెల్లించే వారికి ఊరట లేదు

వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆశించిన ఇఎంఐ చెల్లింపుదారులు, ప్రజలు నిరాశే ఎదురైం ది. ఆర్‌బిఐ సమీక్షలో బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి రెపో రేటును 6 మంది సభ్యులలో 5 మంది స భ్యులు రెపో రేటును మార్చకూడదని ఓటు వేశారు. రెపో రేటును 6.50 శాతం వద్ద స్థిరంగా ఉండనివ్వాలని ఎంపిసి నిర్ణయించినట్లు గవర్నర్ తెలిపారు. ఆర్‌బిఐ క్ష్మీపో రేటులో ఎలాంటి మార్పు చేయకపోవడం ఇది వరుసగా ఏడోసారి.

రిజర్వ్ బ్యాంక్ ఎంపిసి వరిసారిగా రెపో రేటును 14 నెలల క్రితం 2023 ఫిబ్రవరిలో మార్చింది. అప్పట్లో రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం 5 శాతం పైన ఉండగా, 4 శాతం దిగువకు తీసుకోవాలని ఆర్‌బిఐ భావిస్తోంది. ఫిబ్రవ రి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.09 శాతానికి తగ్గింది. మార్చి నెల గణాంకాలు ఇంకా విడుదల కాలేదు. డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 8 శాతానికి పైగా ఉంది. మార్చి త్రైమాసికంలో మొత్తం ఆర్థి క సంవత్సరం 2023-24లో వృద్ధి రేటు 8 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా. ప్రస్తుత సిరీస్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగజారినప్పటికీ, ఆహార పదార్థాల పరంగా ద్రవ్యోల్బణం పరిస్థితి అనిశ్చితంగానే ఉందని గవర్నర్ చెప్పారు.

ఎంపీ అభ్యర్థి కొంపెల్లి మాధవీలతకు వై ప్లస్ సెక్యూరిటీ

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పార్లమెంటు ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొంపెల్లి మాధవీలతకు వై ప్లస్ సెక్యూరిటీని కల్పించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం సున్నితమైన ప్రాంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వై ప్లస్ సెక్యూరిటీలో భాగంగా మాధవీలతకు 11 మంది భద్రత కల్పించనున్నారు. ఇందులో ఆరుగురు సీఆర్‌పీఎఫ్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ ఆమె వెంట నిత్యం పహారా కాస్తారు. మరో ఐదుగురు సాయుధులైన గార్డులు ఆమె నివాసం వద్ద సెక్యూరిటీగా ఉండనున్నారు.

రావణరాజ్యాన్ని అంతం చేసేందుకే కూటమిగా ఏర్పాటు : చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 6:ఏపీలో రావణరాజ్యాన్ని అంతం చేసేందుకు కూటమిగా ఏర్పడ్డామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రావణసూరుణ్ణి చంపడానికి వానరసైన్యం రాముడితో అంతా కలిసి పనిచేసిందని , చివరకు ఉడత కూడా సహాయం చేసిందని గుర్తు చేశారు. పల్నాడు జిల్లా క్రోసూరులో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడారు.

ఎన్నికల్లో శవ రాజకీయాలను అడ్డం పెట్టుకుని జగన్ వస్తుంటే నేను నాయకులతో కలిసి రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడేందుకు కలిసి వస్తున్నామని వెల్లడించారు.

కేంద్రం లో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే కావడంతో తామూ కూడా అదే పార్టీతో కూటమిగా ఏర్పడ్డామని పేర్కొన్నారు.

ఐదు సంవత్సరాల పాలన పీడకల లాంటిదని ఆరోపించారు.

ముఖ్యమంత్రి స్వార్థంకోసం పనిచేస్తుంటే టీడీపీ రాష్ట్రం అభివృద్ధి కోసమే పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇసుకసురులను బోన్‌లో పెట్టి ఇసుకను పేదలకు ఉచితంగా ఇస్తామని, 40 లక్షల భవన నిర్మాణ కార్మికులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తిరుమలలో విచిత్రం.. భక్తుల కాళ్లకు గోనె సంచులు

-తిరుమల దారుల్లో ఊహించనంత టెంపరేచర్లు
-భగ్గుమంటున్న సూర్యుడు.. మండిపోతున్న కొండలు
-కాలిబాట దారిలో భక్తులకు తీవ్ర అవస్థలు

తిరుపతి, ఏప్రిల్ 6:తిరుమలలో కొందరు భక్తులు కాళ్లకు గోనె సంచులు కట్టుకుని కనిపించారు. ఏమైందని ఆరా తీస్తే అసలు విషయం తెలిసింది. తిరుమల కొండపై విపరీతంగా ఎండ తీవ్రత పెరిగింది. మధ్యాహ్నం సమయంలో ఎండను చూస్తే నిప్పుల కొలిమిలా అనిపిస్తోంది. ఈ క్రమంలో ఆలయ పరిసర ప్రాంతాల్లోని కాలిబాట కూల్ పెయింట్ కొన్ని చోట్ల వేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొందరు భక్తులు ఆ వేడి నుంచి పాదాలను కాపాడుకునేందుకు ఇలా కాళ్లకు లడ్డూ ప్రసాద వితరణకు వినియోగించే జూట్ బ్యాగులను పాదాలకు ధరించి భక్తులు నడుస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలోనే టీటీడీ వెంటనే చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. టీటీడీ కూల్ పెయింట్ వేసి వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

అప్పుల బాధతో నేతన్న ఆత్మహత్య.. కుటుంబ సభ్యులకు కేటీఆర్ పరామర్శ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): ఉపాధి కరువై అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు సిరిపురం లక్ష్మినారాయణ మృతదేహానికి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయం కింద పార్టీ తరపున రూ. 50 వేలను కుటుంబానికి అందించారు కేటీఆర్.

నేతన్న కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన ఆర్థిక సాయానికి సంబంధించి కలెక్టర్ అనురాగ్ జయంతితో కేటీఆర్ మాట్లాడారు. ప్రభుత్వం తరపున రావాల్సిన సహాయాన్ని వెంటనే అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నేతన్న లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

అంగన్వాడి కేంద్రంలో అన్యువల్ డే

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని భవానినగర్ ఉన్న అంగన్వాడి కేంద్రంలో శనివారం అన్యువల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కనకమ్మ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరిని తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలకు హాజరు అయ్యేలా చూడాలని తెలిపారు. మూడు సంవత్సరాల పిల్లలకు ఎల్కేజీ బుక్స్,, నాలుగు సంవత్సరాలు నిండిన పిల్లలకు యూకేజీ బుక్స్ అంగన్వాడి కేంద్రాల్లో ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. మూడు నుండి నాలుగు సంవత్సరాల పిల్లలకు ప్రతి సంవత్సరం జూలై, డిసెంబర్, ఏప్రిల్ నెలలలో శారీరక వికాసం, భాష నేర్చుకునే విధానంపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో టీచర్స్ ఎం శోభారాణి, ఏ సరస్వతి, కే మునెమ్మ, ఎస్ మీనాక్షి, ప్రీ స్కూల్ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా 44వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ బిజెపి రూరల్ పార్టీ కార్యాలయంలో 44వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం టిఫిన్ బ్రెటక్ కార్యక్రమం నిర్వహించి, ఇంటింటిపై బీజేపీ జెండా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి మాట్లాడుతూ పండిత్ దిన్ దయాళ్ ఉపాధ్యాయ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన పార్టీని 1980 నుండి ఇప్పటివరకు మాజీ ప్రధాని వాజ్పాయ్ మొదలు నేటి ప్రధాని నరేంద్ర మోడీ వరకు పార్టీని ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్త ఉన్న పార్టీగా ఆవిర్భవించడం జరిగిందన్నారు. రానున్న పార్లమెంటు ఎలక్షన్లో పీర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అనే నినాదంతో 400 సీట్ల లక్ష్యంగా బిజెపి కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిషోర్, మండల ఉపాధ్యక్షులు సందేసారి మల్లికార్జున్, ఎగుర్ల అనిల్, కార్యదర్శులు గోపు ప్రవీణ్, దానే తిరుపతి, కిషన్ మొర్చ అధ్యక్షులు గొల్లపల్లి వెంకటేష్, ప్రధ కార్యదర్శి కావేరి రాజు, బీజేవైఎమ్ అధ్యక్షులు జంగం వంశీ, బూత్ అధ్యక్షులు తోట శేఖర్, గుమ్మడి శ్రీనివాస్, తిరుపతి నరేందర్ పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగాలు, పద్యాలు, పాటలు, నృత్యాల ద్వారా విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు ప్రత్యేకంగా జరుపుకునే పండుగల్లో ఉగాదికి అగ్రస్థానం ఉంటుందని, ఎందుకంటే తెలుగు నూతన సంవత్సరం ప్రారంభమయ్యేది ఈ రోజు నుంచే అని తెలిపారు. హిందూ పంచాంగం ప్రకారం ఏటా చైత్ర శుద్ధ పాడ్యమినాడు ఉగాది పర్వదినం జరుపుకుంటారని, ఉగాది పండుగను తెలుగు సంవత్సరాది అని కూడా అంటారని తెలిపారు.

ఉగాది పచ్చడి యొక్క ప్రయోజనాలు, ఔషధ గుణాల గురించి విద్యార్థులకు తెలిపారు. రాబోయే తెలుగు సంవత్సరం ఎలా ఉండబోతుందో తెలియజేస్తూ ఇతర తెలుగు సంప్రదాయాలతో పాటు పంచాంగాన్ని కూడా పఠించారు. విద్యార్థుల అద్భుత ప్రదర్శనలకు అభినందనలు తెలిపారు. పిల్లల్లో సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించేందుకు పాఠశాల నిర్వహిస్తున్న ఉగాది వేడుకలకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ కళ్యాణ్ కుమార్, అధ్యపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆహ్వానం

శ్రీ క్రోధి నామ సంవత్సర

ఉగాది జాతీయ కవిసమ్మేళనం

తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహణలో లక్ష్యసాధన ఫౌండేషన్, కుసుమ ధర్మన్న కళాపీఠం, గోల్కొండ సాహితీ కళాసమితి, పాలడుగు నాగయ్య కళాపీఠం, దర్పణం సాహిత్య వేదిక, ప్రగతిశీల వీర శైవ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో

వేదిక : శంకర్‌మఠం, ఓయూ రోడ్, నల్లకుంట, హైదరాబాద్

తేది : 07-04-2024 ఆదివారం ఉ. 9.30 గం.ల నుండి

ముఖ్య అతిథి : డాక్టర్ బాలాచారి గారు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి

సభాధ్యక్షులు : శ్రీ పంటా మనోహర్ రెడ్డి గారు, ప్రముఖ కవి విమర్శకులు

విశిష్ట అతిథులు : డాక్టర్ బి. జయరాములు గారు, విశ్వసాహితి అధ్యక్షులు
శ్రీ కె. పరందర్ రెడ్డి గారు, ప్రముఖ వ్యాసాలేఖకుడు
శ్రీ బైలూరి యోగేష్ ప్రభు గారు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారుడు

ఆత్మీయ అతిథులు : డా. వాకేశ్వరం శంకరం గారు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు
శ్రీ కె. దయానంద్ గారు, CEO, విశ్వభారతి క్రెడిట్ సొసైటీ
శ్రీమతి పి.వి.పి. అంజనీ కుమారి గారు
మాపరిండెంట్, పి.ఎన్.పి.పి. హైదరాబాద్
డాక్టర్ బి. రాజారక్షం గారు, ఓయంటల్ కళాశాల డీన్

గౌరవ అతిథులు : డా. చింతి బత్రీనాథ్ గారు, ప్రగతిశీల వీరశైవ సమాజం అధ్యక్షులు
శ్రీ పక్క శ్రీనివాస్ యాదవ్ గారు, సంఘ సేవకులు

ఉగాది విశిష్ట పురస్కారాలు

1. శ్రీ అక్క రామకృష్ణ గారు, సంఘ సేవకులు, సామాజికవేత్త
2. వాచస్పతి డా. మల్లి కృష్ణారెడ్డి గారు, D. Lit, ఆధ్యాత్మిక రంగం
3. శ్రీ వేములి అనంత రామకృష్ణ శర్మ గారు, సాహిత్య రంగం
4. డా. బలిజేపల్లి నాగరత్నం గారు, సాహిత్య రంగం
5. శ్రీమతి వేములి మంజుల గారు, గాయని

ముగింపు సభ

ముఖ్య అతిథి : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు
OU తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు

సభాధ్యక్షులు : శ్రీ రామకృష్ణ చంద్రప్రభాత గారు, ప్రముఖ కవి విమర్శకులు

విశిష్ట అతిథులు : వాచస్పతి డా. మల్లి కృష్ణారెడ్డి గారు, D. Lit, ఆధ్యాత్మిక రంగం
డా. అర్థచంద్రప్రకాష్ రెడ్డి గారు
గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు
శ్రీ బైవ దేవదాసు గారు, నేటినిజం పత్రిక సంపాదకులు
శ్రీమతి పొలుదుసు పరోజనీదేవి గారు
మెడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్
శ్రీ ప్రజ్ఞారాణి గారు, లక్ష్యసాధన ఫౌండేషన్ ఛైర్మన్
శ్రీమతి జ్ఞానప్రభాత గారు, గీతా ఫౌండేషన్ గౌరవ సలహాదారులు

కవిసమ్మేళన నిర్వహణ
డా. రాధా కుసుమ
కుసుమ ధర్మన్న కళాపీఠం ఛైర్‌పర్సన్

నిర్వహణ
పి. బడేసాబ్, తెలుగుభాషా చైతన్య సమితి

మార్చి యూపీఐ చెల్లింపుల్లో కొత్త రికార్డు.. 40.81 శాతం పెరుగుదల..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఇప్పుడు రోజువారీ కిరాణ సరుకులు మొదలు.. సినిమా టికెట్లు, యుటిలిటీ బిల్లుల చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే సాగుతుంటాయి. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత మొబైల్ యాప్స్‌తో చెల్లింపులు క్షణాల్లో పూర్తవుతాయి. రోజురోజుకు పెరుగుతున్న యూపీఐ పేమెంట్స్ గత నెలలో సరికొత్త రికార్డు నెలకొల్పాయి.

గత నెలలో 1,344 కోట్ల లావాదేవీల్లో రూ.19.78 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. గత ఫిబ్రవరి యూపీఐ పేమెంట్స్ రూపంలో రూ.18.28 లక్షల కోట్లు లావాదేవీ లు జరిగాయి.

గతేడాది మార్చి లావాదేవీలతో పరిగణిస్తే లావాదేవీలు 55.35 శాతం పెరిగితే చెల్లింపులు 40.81 శాతం పుంజుకున్నాయి. 2023 మార్చిలో యూపీఐ ద్వారా రూ.14.05 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి.

గతేడాదిలో యూపీఐ ద్వారా రూ.199.95 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. 2022-23తో పోలిస్తే 43.68 శాతం పెరిగాయి.

2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.139.1 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. యూపీఐ పేమెంట్స్ 2016లో ప్రారంభం అయ్యాయి. మార్చి లావాదేవీలతో పోలిస్తే ఫిబ్రవరిలో స్వల్పంగా యూపీఐ చెల్లింపులు తగ్గాయి.

పెళ్లి కావటం లేదని యువకుడి ఆత్మహత్య..

ఆదిలాబాద్, ఏప్రిల్6: పెళ్లి కావడం లేదని యువకుడు మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కొత్తగల్లికి చెందిన జాదవ్ జ్ఞానేశ్వర్ (21)కు గత కొంతకాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు.

అనేక సంబంధాలు చూసినప్పటికీ ఏ ఒక్కటి కూడా సెట్ కాలేదు. కొత్త పంచాంగం ఉగాది పండుగ తర్వాత పెళ్లి సంబంధాలు చూస్తామని తల్లిదండ్రులు చెప్పడంతో రెండు మూడు రోజులుగా నిర్లప్తంగా ఉన్నాడు. పెళ్లి అవుతలేదనే మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి జాదవ్ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

పేను(లైస్) చికిత్స పరిష్కారాల గురించి అవగాహన

హైదరాబాద్, ఏప్రిల్ 6:దాదాపు 50 సంవత్సరాలకు పైగా బలమైన వారసత్వంతో, విశ్వసనీయమైన పేను చికిత్స బ్రాండ్ గా గుర్తింపు పొందిన మెడికర్ (ఓవటతిఎవతీ) , పిల్లలలో పేను సమస్యపై ఒక సమావేశాన్ని నిర్వహించింది. తమ హెయిర్ హైజీన్ మిషన్‌తో చర్చ ను నిర్వహించటం లో భాగంగా , ఏపీ డ తెలంగాణా రాష్ట్రాల్లోని పిల్లలకు సాధారణ లక్షణాలు, నివారణ చర్యలు మరియు పేనులను తొలగించడానికి సమర్థవంతమైన పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది.

ఐఎంఆర్బి నిర్వహించిన ఇటీవలి అధ్యయనం ప్రకారం, ప్రతి సంవత్సరం ప్రతి 3 లో ఒకరు లేదా 37% కంటే ఎక్కువ కుటుంబాలను పేను లు ప్రభావితం చేస్తున్నాయి. నేడు చాలా గృహాలు పేను దువ్వెనలను ఉపయోగిస్తున్నాయి. అయినప్పటికీ, సాంప్రదాయ పేను దువ్వెన పెద్ద పేనులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుంది, చిన్న పేనులను వదిలివేస్తుంది, ఇది పునరావృత సమస్యకు దారితీస్తుంది. మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీమతి సోమశ్రీ బోస్ అవస్తి మాట్లాడుతూ, "ఒక బ్రాండ్‌గా, వినియోగదారులకు సమర్థవంతమైన పరిష్కారాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. కొబ్బరి డ వేప యొక్క 100% సహజ యాక్టివ్‌లతో పిల్లల కోసం తీర్చిదిద్దిన సురక్షితమైన షాంపూతో కేవలం నాలుగు వారాలలో పేను తొలగింపును సౌకర్యవంతముగా మార్చింది. హెయిర్ హైజీన్ మిషన్ ద్వారా, మెడికర్ 300 పాఠశాలలు మరియు 3.5 లక్షల మందికి పైగా పిల్లలకు పేను సమస్యను ఎదుర్కోవడంలో అవసరమైన జ్ఞానం అందించింది. దేశవ్యాప్తంగా ఈ మిషన్ ను విస్తరించడం ద్వారా మా వినియోగదారులతో లోతైన బంధాన్ని నిర్మించడానికి మేము పని చేస్తూనే ఉంటాము" అని అన్నారు. ఈ సెషన్‌లో డాక్టర్ అమూల్య మైసూర్, కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ ఉ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ "తలలో పేనులు ఉండటం సాధారణమైనప్పటికీ, తరచుగా గుర్తించబడవు లేదా తప్పుగా గుర్తించబడవచ్చు, ఇది బాధిత పిల్లలకు దీర్ఘకాలిక అసౌకర్యం , సంభావ్య సమస్యలకు దారితీస్తుంది. వేప మరియు కొబ్బరి వంటి సహజ పదార్థాలు పేను సమస్యను పరిష్కరించడంలో ప్రభావవంతంగా ఉంటాయి" అని అన్నారు

ఈ కార్యక్రమం ద్వారా , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులలో ప్రోత్సాహకరమైన ప్రతిస్పందనను బ్రాండ్ చూసింది. పాఠశాల పిల్లల సృజనాత్మకతను వెలికితీసేలా డ్రాయింగ్ పోటీని కూడా నిర్వహించింది, ఇందులో అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొనడం జరిగింది. 1968లో ప్రారంభించబడిన మెడికర్ దేశం విశ్వసించే బ్రాండ్ గా మారింది.

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు పెరుగుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకుని అమాయక ప్రజలను అధిక వడ్డీ ఆశా చూపి పెట్టిన పెట్టుబడి కంటే అధిక డబ్బులు వస్తాయని మోసం చేస్తున్నారని, జిల్లా ప్రజలు ఇలాంటి అన్ లైన్ యాప్ లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు అని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రజలు ఎవరైనా సైబర్ మోసాలకు గురి అయితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930 ,డయల్ 100 కి కాల్ చేసి తెలియజేయగలరని అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు ఇంస్టాగ్రామ్ లో ఐపీఎల్ టికెట్స్ సేల్ అనే లింకు చూసి లింక్ క్లిక్ చేయగా వాట్సాప్ లో మెసేజ్ చేశారని, ఐపీఎల్ టికెట్స్ కావాలనుకుంటే వాళ్ళు పంపించిన స్కానర్స్ కి అమౌంట్ పంపియమని చెప్పారని, బాధితుడు అది నమ్మి 32 వేల రూపాయలు పంపించారని, కానీ టికెట్స్ రాలేదన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిగ్రామ్ యాప్ లో పార్ట్ టైం జాబ్ ఇస్తామని చెప్పి ఆన్లైన్లో డబ్బు సంపాదించుకోవచ్చు అని చెప్పి టెలిగ్రామ్ లో వాళ్ళని కాంటాక్ట్ అయ్యారని, ఇనిషియల్ గా అమౌంట్ ఇచ్చారని, తర్వాత టాస్కులు ఉంటాయని చెప్పి ఇన్వెస్ట్మెంట్ చేయమని చెప్పి నమ్మించారని, ఆ విధంగా లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసి మోసపోయారన్నారు. వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు ఓఎల్ఎక్స్ లో సోఫా అమ్ముతా అని అడ్వర్టైజ్మెంట్ పెట్టడం జరిగిందని, అది చూసిన సస్పెక్ట్ బాధితునికి కాల్ చేసి తనను హోల్సేల్ గా పరిచయం చేసుకొని, బాధితునికి క్యూఆర్ కోడ్ స్కానర్స్ పంపించడం జరిగిందని, అవి స్కాన్ చేస్తే మీకు అమౌంట్ వస్తాయని బాదితున్ని నమ్మించగా, బాదితుడు స్కాన్ చేయడంతో 98 వేల రూపాయలు లాన్ అయ్యారన్నారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫేస్బుక్లో ఈ కామర్స్ ప్లాట్ఫారం నుండి మీకు గిఫ్ట్ ఓచర్ వచ్చింది అని లింక్ చూసి ఆ లింకును క్లిక్ చేయడం జరిగిందని, వెంటనే యూపీఐ పిన్ అడగగా బాధితుడు తనకే అమౌంట్ వస్తాయి అనుకొని యూపీఐ పిన్ ఎంటర్ చేయడం జరిగిందని, దాంతో 5000 రూపాయలు నష్టపోయారన్నారు. లాటరి పేరుతో సైబర్ మోసాలు, అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మెసేజెస్ వస్తే వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వేలల్లో పెట్టుబడి లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రామ్ ప్రకటనలను నమ్మవద్దన్నారు. తక్కువ డబ్బులు పెట్టినప్పుడు లాభాలు ఇచ్చి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు డబ్బుల ఇవ్వకుండా మోసం చేస్తారని, ఇలాంటి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. ఉద్యోగం ఇస్తాం అంటూ మెసేజెస్ చేసి, మిమ్మల్ని డబ్బులు కట్టమంటున్నారు అంటే వాళ్ళు సైబర్ మోసగాళ్ళు అని గ్రహించాలన్నారు.

సోషల్ మీడియాలో ప్రకటనలు చూసి పెట్టుబడి పెట్టవద్దని, మీ ప్రమేయం లేకుండా మీకు ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పవద్దని, అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అయివుండవచ్చని పేర్కొన్నారు.

ఈనెల 13న కరీంనగర్లో గ్రాండ్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్

-కరీంనగర్ విద్యార్థులు ఈసదవకాశాన్ని వినియోగించుకోండి

-జియో7 ప్లై సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ముకర్రం మహమ్మద్

కరీంనగర్, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి) ఆకాశమే హద్దుగా విదేశాల్లో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించి డాక్టర్ కావాలని కోరుకునే ఔత్సాహిక విద్యార్థులకు జియో7 ప్లై సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 13న కరీంనగర్ పట్టణంలోని ప్రతిమ మల్టీప్లెక్స్ కన్వెన్షన్ 3లో "అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్" సెమినార్ ను నిర్వహిస్తున్నట్లు జియో7 ప్లై మేనేజింగ్ డైరెక్టర్ ముకర్రం మహమ్మద్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ముఖరం మహమ్మద్ ఈ సెమినార్ కు సంబంధించిన పలు వివరాలను వెల్లడించారు. యూఎస్, యూకే, కెనడా, జార్జియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలోని ప్రముఖ పేరొందిన యూనివర్సిటీలకు సంబంధించిన ప్రతినిధులు ఈ సెమినార్ కు హాజరవుతున్నారని చెప్పారు. కరీంనగర్ చరిత్రలో విదేశీ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు నేరుగా ఇలాంటి సెమినార్ కు రావడం మొదటిసారని పేర్కొన్నారు. విద్యార్థులకు సెమినార్ కాగానే స్పాట్ అడ్మిషన్ సౌకర్యం ఉంటుందని, అంతర్జాతీయ స్కాలర్షిప్స్ నాలుగు లక్షల వరకు, తెలంగాణ ప్రభుత్వ విదేశీ విద్య స్కాలర్షిప్ 20 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఎంబిబిఎస్ చదవాలనుకునే విద్యార్థులు జార్జియాలోని ప్రముఖ ప్రభుత్వ యూనివర్సిటీ "ఎస్ఈయు" ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఇందులో నీట్ ఉత్తీర్ణులు అయిన వారు, నీట్ ఉత్తీర్ణులు కాని వారికి ఎంబీబీఎస్ లో అడ్మిషన్ దొరుకుతుందన్నారు. ఎంబిబిఎస్ చదివే విద్యార్థులకు జార్జియా దేశంలోని ప్రముఖ యూనివర్సిటీలో ఒక ఏడాదికి రూ.4.50 లక్షలు మాత్రమే ఉందని, ఇంటర్ లో 82% పైగా ఉత్తీర్ణులైన వారికి ఒక సంవత్సరం పాటు ట్యూషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని, ఈ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు 15వందల యుఎస్ డాలర్ల మెడికల్ కిట్ లేదా ల్యాప్ టాప్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. కెనడా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ కు సంబంధించి, కెనడాలోని ప్రముఖ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధి బృందం వస్తుందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించాలనే తపన కలిగిన విద్యార్థులు ఈ సెమినార్ కు పెద్ద ఎత్తున హాజరై విజయ వంతం చేయాలని కోరారు. ఈ అబ్రాడ్ ఎడ్యుకేషన్ పెయిర్ కు హాజరయ్యే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని పూర్తిగా ఉచితమని చెప్పారు. మరిన్ని వివరాలకు ముకరం మహమ్మద్ 881 88107 11 కు సంప్రదించాలని కోరారు.

పంట నష్టానికి ఎకరానికి 25000 వెంటనే చెల్లించాలి

-యాసంగి సీజన్ నుండి రైతులకు 500బోనస్ ఇవ్వాలి

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): రైతుల పంట నష్టానికి ఎకరానికి 25000 వెంటనే చెల్లించాలని, యాసంగి సీజన్ నుండి రైతులకు 500బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం గంగుల కమలాకర్ నిరసన దీక్ష చేపట్టారు.

ఈ సంధర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ చివరి దశలో ఉన్న పంటలను కాపాడేందుకు సాగునీరు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 25 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలన్నారు. రైతుబంధు డబ్బులు వెంటనే విడుదల చేయాలని, కరీంనగర్ నగరానికి ప్రతీరోజూ తాగునీరు ఇవ్వాలని తెలిపారు.

నగర తాగునీటి అవసరాలకు లోయర్ మానేరులో నీటి నిల్వ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

-బీఆర్ఎస్ నాయకుడు చెల్మెడ లక్ష్మి నరసింహరావు

-బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పిలుపు మేరకు తెలంగాణ ప్రాంత రైతన్న పండించిన ఆన్ని పంటలకు క్వింటాల్ కు 500 బోనస్ చెల్లించాలనీ డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వేములవాడ నియెజకవర్గ ఇంఛార్జ్ చెల్మెడ లక్ష్మి నరసింహరావు నాయకత్వంలో శనివారం బిఆర్ఎస్ పార్టి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చెల్మెడ లక్ష్మి నరసింహరావు మాట్లాడుతూ గ్రామాల వారీగా పంటల నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యాసంగి పంటలకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. రైతులకు 2 లక్షల రుణ మాఫీ వెంటనే చేయ్యాలని, రైతు భరోసా క్రింద ఏకరానికి 15000 లు చెల్లించాలన్నారు. రైతు కూలీలకు 12000 వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరేదాక వదిలేదిలేదనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రాజు, బి ఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, గోస్కుల రవి, గడ్డం హనుమాన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.